


# శ్రీ సాయి దర్శన్


సాయి ప్రబోధ ప్రచార మాసపత్రిక

| సంపుటి–7 | జూన్ – 2008 | సంచిక 7 |
|---|---|---|

## SRI SAI DARSHAN

*(SaiPrabhodha Prachar Monthly)*



Editor : **Raojee**

Associated Editor : **A. Lakshmi**



**Subscription Rates**

| | |
|---|---|
| Maharaja Poshakulu | Rs.1,501-00 |
| Life Membership (20 Yrs) | Rs.751-00 |
| For 3 Years | Rs.275-00 |
| For 1 Year | Rs.100-00 |

M.O's / DD's may be drawn in favour of



**SRI SAI DARSHAN**
Dammaiguda, Nagaram Post,
Hyderabad - 500 083.
Phone : 040-65640220
Cell : 98667 48099
e-mail : srisaidarshan@rediffmail.com
Website : www.srisaidarshan.org.in


**శ్లో॥ యోగయుక్తో విశుద్ధాత్మా**
**విజితాత్మా జితేంద్రియః।**
**సర్వభూతాత్మభూతాత్మా**
**కుర్వన్నపి న లిప్యతే॥**

**(భ.గీ.5 - 7)**

**తా॥ మనస్సును వశమునందుంచుకొనినవాడు, జితేంద్రియుడు, అంతఃకరణశుద్ధి కలవాడు, సర్వప్రాణులలో ఆత్మస్వరూపుడైన పరమాత్మను తన ఆత్మగా కలవాడు అగు కర్మయోగి కర్మలను ఆచరించుచున్నను ఆ కర్మలు వానిని అంటవు.**

# విషయసూచిక


సంపాదకీయం......3
శ్రీసాయిసద్గురు సమర్థ–సగుణోపాసన......4
ఆనాటి బాబా భక్తుల అనుభవాలు......5
ఓం సాయిరాం......8
శ్రీసాయిబాబా జన్మరహస్యం......9
వామను, కుండలు......14
పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ......19
బలరాం ధురందర్......24
ఔదుంబరవృక్ష మహిమ......26
విశుద్ధాత్మా, విశోధనః......28
కర్మ సన్న్యాసయోగము......36
శిలధిపుర నివాస సాయినాథ......45
దైవం మానవరూపంలో......46
బాబా భిక్షచేసిన 5 అదృష్టవంతుల గృహములు......49
సాయినాథ ఉవాచ......52
ఆధ్యాత్మిక దర్శన్......57
ధ్యానం......59
శ్రీలలితా సహస్రనామములు......60
అన్నదానం పరమోత్కృష్టం......62
ఆణిముత్యాలు......69
సూక్తులు......70
లేఖలు......72






## దైవమే నిజగురువు

ఈనాటి ప్రాకృత గురువులు చేసే బోధలచేత మానవత్వములోని దివ్యతత్త్వము మరింత అడుగున పడిపోతున్నది. కేవలం బోధించువాడు కాదు గురువు. మంత్రము నుపదేశించువాడు కాదు గురువు. గుణము, రూపము లేనివాడు ఒక్క దైవమే. కనుకనే "గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః" అన్నారు. నిజమైన గురువు దైవమొక్కడే. మిగిలిన వారందరు అధ్యాపకులే. గురువంటే గురిని చూపించేవాడని అర్థం. గురి అనగా ఆత్మతత్త్వము. తనను తాను తెలుసుకున్నవాడే నిజమైన గురువు. ఆచరించి ప్రబోధించేవాడే ఆచార్యుడు.

మీరు ఎవరి వద్దనైనా విద్యను నేర్చుకోవచ్చు, తప్పు లేదు. కాని మీ జీవితము భగవంతునికి మాత్రమే అర్పితం కావాలి. అదే నిజమైన భక్తి. అదే నిజమైన ఆధ్యాత్మికం.

# శ్రీసాయిసద్గురు సమర్థ-సగుణోపాసన

మూలం :- శ్రీకృష్ణారావ్ జోగేశ్వర్ భీష్మ అనుసరణ : నైనారు అప్పాస్వామి

రెండవ భాగం- మధ్యాహ్నఆరతి 12.00 గం॥లు

**1. జయము జయమో సాయినాథా !**




*జయము జయమో దేవ ! దత్తావధూతా !*
*సాయి అవధూతా ! చేతులు జోడించి*
*నా శిరసు మీ పాదాల చెంతనుంచేను*
*జయము జయమో దేవ ! సాయినాథా !*

*1. ధర్మగ్లాని జరుగగా మీరు అవతరిస్తారు,*
*నాస్తికులు సైతం మిము నమ్ముతారు,*
*పలులీలలను మీరు చూపెదరో దేవా !*
*నానా రూపాలతో మీరు కన్పించి*
*భక్తుల కష్టాలు తొలగించుతారు.*
*అహరహము కాపాడుతారు*
*జయము జయమో సాయినాథా !*

*2. ఒక భక్తునికి మీరు ముస్లింవేషాన*
*దర్శనమిచ్చారు. అతని శంకను మాన్పి*
*ఆత్మైకపథాన నడిపించినారు.*
*రాజా గోపీచందాను, మందాకినీ నదినికూడా*
*పావనమొనరించారు మీరు దేవా !*
*సాలీల వంశాన ముస్లింగా మీరు జన్మించి*
*అందరికి ముక్తిని ప్రసాదించారు*
*జయము జయమో సాయినాథా !*

*3. భేదభావములేక హిందూముస్లింల*
*నేకరీతిగ మీరాదరించారు*
*ఈ మానవరూపాన్ని తిరిగి ధరించారు*
*సమానప్రేమతో నందరిననుగ్రహించారు*
*మీ శక్తులెంతటి పరిపూర్ణాలో చూపావు దేవా !*
*జయము జయమో సాయినాథా !*

*4. ఓ సాయిదేవా ! సవినయముగ నేను*
*మీ పాదాల చెంతనుండగా నభిలషింతు*
*ప్రజలు లౌకికబంధాలలో తగిలియుండ*
*వారికి ముక్తిని ప్రసాదింప మీరిలనున్నారు దేవా !*
*ఆదరము జూపి అందరి కష్టాలు తీర్చుమో సాయీ !*
*నాకేదేని ప్రసాదింప వాంఛింతురేని*
*మీ మహిలను పాడగ శక్తినిమ్మో సద్గురు సాయీ !*
*జయము జయమో సాయినాథా !*





# ఆనాటి బాబా భక్తుల అనుభవాలు

'అమృతధార' ఆనాటి శ్రీ షిరిడీసాయిబాబా భక్తుల అనుభవాలు ఆంగ్లమూలం
శ్రీ బి.వి.నరసింహస్వామీజీ, తెలుగు అనువాదం శ్రీతోట భాస్కరరావు,
ప్రచురణ : శ్రీ షిరిడి సాయిబాబా మందిరము, కొవ్వాడ

## కొలాంబో ఉరఫ్ డి.వి.సంభారే గౌడు సారస్వతి

### వయస్సు 57 సం॥లు, వీరి అనుభవములు

బాబా తాను చిలుము పీల్చి తన దగ్గరలో చుట్టూ యుండేవారికి యిచ్చుచుండెను. నేను బీడీలు త్రాగేవాడిని, చిలుము అలవాటు లేదు. బాబా నా మనస్సులో కోరిక గ్రహించి, నన్ను తన దగ్గరగా వచ్చి కూర్చుని చిలుము పీల్చుమనెను. నా మనస్సులోని కోరికను గ్రహించి దయతో నాకు చిలుము పీల్చుటకు అవకాశమిచ్చినందులకు నేను ఎంతో సంతోషించితిని.

నాకు పొగ త్రాగుట కన్నా మరియొక ప్రమాదకరమైన అలవాటు యున్నది. త్రాగుడు 12-1917న బాబా నా ఛాతిపై కూర్చొనినట్లు కల వచ్చెను. కలలో నేను ఏమి చేస్తున్నానని అడిగిరి. నేను త్రాగుడు మానివేస్తానని హామీ యిచ్చితిని. మరుసటి రోజు నుండి నేను త్రాగుట పూర్తిగా మానివేసితిని. 15-2-1917న నాకు ఒక పరీక్ష ఎదురైనది. నేను పనిచేయు ఆఫీసు మేనేజరు ఒక విందు భోజనము ఏర్పాటుచేసి, నన్ను కూడా ఆహ్వానించెను. నన్ను మద్యము తీసుకోమని బలవంతపెట్టిరి. డాక్టరుగారు తీసుకోవద్దని చెప్పినారు. అందులకై నేను తీసుకొనననంటిని. బాబా నన్ను మద్యము తీసుకొనవద్దని చెప్పినట్లుగా చెప్పలేదు. నన్ను యింకనూ బలవంతము చేయుచుండిరి. అప్పుడే అదృష్టవశాత్తు లైట్లు పోయెను. ఎందుచేత లైట్లు పోయెనో అని

చూచుటకై మేనేజరు బయటకు వెళ్ళెను. ఆ చీకటిలో నా ప్రక్కన కూర్చొనియున్న అతను ఆ గ్లాసు తీసుకొని త్రాగివేసెను. లైట్లు రాగానే నా ఖాళీగ్లాసు చూసి, త్రాగి వేసితిని అని మేనేజరు అనుకొనెను.

కొద్దినెలల తరువాత నేను బాబా దర్శనమునకై వెళ్ళగా, బాబా యితరులను దక్షిణ అడిగి తీసుకొనిరిగాని నన్ను అడుగలేదు. నేను నా చెడు అలవాటు అయిన త్రాగుడు మానివేసితిని కావున, నాకు అందులకు బహుమతిగా బాబా నన్ను దక్షిణ అడగలేదని నేను అనుకొంటిని. నేను వాడాలో అందరితో, నన్ను బాబా దక్షిణ అడగలేదని గొప్పగా చెప్పుకొంటిని. వెంటనే బాబా వద్ద నుండి నాకు పిలుపు వచ్చినది. నేను మశీదుకి వెళ్ళగా బాబా నన్ను రెండు రూపాయలు దక్షిణ అడుగగా నేను ఇచ్చితిని. వేరొక భక్తుడు తన వద్దనున్న 18 రూపాయలను నావద్ద దాచి, బాబా వద్దకు వెళ్లెను. ఒకవేళ బాబా తనను దక్షిణ అడిగినా, లేదని చెప్పవచ్చును అనుకొనెను. కాని బాబాకు ఈ సంగతి తెలిసి, అతనిని రెండు రూపాయలు దక్షిణ అడిగి, ఆ డబ్బు నావద్ద తీసుకొని ఇమ్మనెను. ఈ విధముగా నావద్ద దాచిన డబ్బులో నుండి బాబాకు రెండు రూపాయలు యివ్వవలసివచ్చెను. (బాబా దక్షిణ అడుగుటలోని అంతరార్థము ఏమిటనగా మనిషిలోని డంబము, ఆశ విధులను విస్మరించుట మొదలగు దుర్గుణములను తీసివేయుట కొరకు.)

పైన చెప్పిన సంఘటన, బాబా సమాధికి కొద్దికాలము ముందు జరిగెను. మేము షిరిడీ వదలి వెళ్ళుటకు బాబా అనుమతికై వెళ్ళు సమయమున, త్వరలో జరగబోయే ఘోరవిపత్తు తెలుసుకొనలేకపోతిమి. కాని బాబాకు తెలుసు. మీరు బొంబాయి నుండి వచ్చితిరి. నేను చెప్పెదంతా మీరు వినుచూ యుండవలెను. మీరు చెప్పేదంతా నేను వినవలెను. కాని మీరు వెళ్ళుచున్నారు



కదా ! సరే వెళ్లండి మీ గమ్యము రేపు మధ్యాహ్న సమయమునకు చేరెదరు అని బాబా అనెను. మేము కోపర్‌గాం నుండి ఆ రాత్రి బయలుదేరితిమి. బొంబాయి మరుసటి రోజు ఉదయం 7.30 లేక 8 గంllలకు చేరవచ్చునని అనుకొంటిమి. కాని మేము మన్మాడు స్టేషనుకు చేరగానే ఇంజను లోపం వలన రైలు నాలుగు గంటలు ఆలస్యముగా నడుచుచున్నట్లు తెలుసుకున్నాము. మేము బొంబాయి చేరుసరికి మధ్యాహ్నము 12 గంటలు అయినది. బాబా షిరిడీలో చెప్పినది నిజమయ్యెను. కొద్ది రోజుల తరువాత బాబా సమాధి చెందిరి. మాకు షిరిడీ వదిలివెళ్లుటకు బాబా ఏల అనుమతి ఇచ్చుటకు సందేహించిరో మాకు ఇప్పుడు అర్థమైనది. ఆఖరిసారిగా మేము బాబానుండి విడిపోతిమి.

14 సంవత్సరముల ముందు బాబా ఒకసారి నాకు కలలో కనిపించి యిలా అనిరి. బిడ్డా ! నేను నీ గురువు అని అందరికి చెప్పుచుంటివి. నేను నీకు ప్రసాదమిచ్చితినా ? (ఉపదేశమిచ్చితినా?) ఆ తరువాత బాబా నా చేతులు కడిగించి, ఒక శ్లోకము (మరాఠీభాషలో) చెప్పి దానిని మళ్ళీ మళ్ళీ చెప్పుచూ యుండమనెను. నేను అదే విధముగా చేసితిని కాని నేను నిద్రలేచిన తరువాత నాకు ఆ శ్లోకము గురించి ఏమీ జ్ఞాపకము లేదు. ఇప్పుడు కూడా ఆ శ్లోకం నాకు జ్ఞాపకం వచ్చుటలేదు.

నాకు కుటుంబ బాధ్యతలు ఎక్కువగా యుండెను. నాకు 5 గురు కుమార్తెలు, ఒక కుమారుడు. నా కుటుంబాన్ని బాబాయే చూచుకుంటున్నారు. ఫలానా కావాలని నేను ఎన్నడూ బాబాను ప్రార్థించలేదు. మన అవసరములన్ని బాబాకు తెలుసు. అటువంటప్పుడు మనము బాబాను మళ్లీ కోరడం ఎందుకు? బాబాకు తెలియదనా? (సశేషం)

# ఓం సాయిరాం

శ్రీమతి పర్వతం రేవతీ ప్రసాద్, ప్లాటు నెం.115, డిఫెన్స్‌కాలనీ, సైనికపురి,
సికింద్రాబాద్ - 500 094



1. ఖాయమే కానిది కాయమనేది
జన్మలెత్తి కర్మలన్ని అనుభవించేది
మాయ కుందరా ఇది, మసి బారకుండా
మసలుకోర మళ్ళీ మళ్ళీ జన్మలెత్తకుండా ॥ ఖా ॥

2. మది మందిరములోన కొలువైన మాధవుని
కనుగొనని మానవుని జన్మ కడు హీనము
ఉరికి ఉరికి ఊళ్ళన్నీ ఊరకే తిరగకురా
ఒళ్ళు హూనమౌనురా దేవుళ్ళు వేరులేరురా ॥ ఖా ॥

3. కలలోని వరములన్ని కలచెదిరితె మాయమౌను
ఇలలోన ఉన్న వన్ని ఎవరి తోడు రావాయెను
మరల మరల రానిది ఈ మానుషజన్మం
పరుల ధ్యాస మానుకో పరమాత్మను ధ్యానించుకో ॥ ఖా ॥

4. వన మెవరి సొంతము? భవన మెవరి సొంతము?
వనములోని ఫలమునకు. భవనములో భవమునకు
సూత్రధారి శ్రీసాయియే అధికారని తెలుసుకో
కాలహరణ మానుకో నామస్మరణ చేసుకో ॥ ఖా ॥



# శ్రీసాయిబాబా జన్మరహస్యం

సాయిదాసానుదాసు సురేంద్రబాబు, కొవ్వూరు, నెల్లూరు జిల్లా

## ఇతర చరిత్రకారులు రూపకల్పన చేసిన కథలు

### శ్రీ సాయిశరణానంద స్వామి చెప్పిన కథ

ఇంతవరకు చెప్పిన కథలు బాబా వాచా వెలువడిన రెండు, మూడు మాటలు తప్ప మరి ఏ ఆధారాలు లేవు. కాని శ్రీ శరణానందస్వామి చెప్పిన దిగువ కథకు ఎన్నో ఆధారాలు, ఋజువులు లభించాయి. అందుకే దీనిని వాస్తవమైనదిగా పలువురు పేర్కొన్నారు. ఇది బహుళ ప్రచారంలో ఉంది కూడా !

మొదట శరణానందస్వామికి బాబా బ్రాహ్మణ కుటుంబంలో పుట్టారనే నమ్మకం ఒకటి ఉండేది. ఎవరైనా బాబా బ్రాహ్మణులు కాదని ఖండిస్తే, బాబా కోపోద్రేకంతో అశాంతచిత్తులు కావడం శరణానంద ఎన్నోసార్లు గమనించాడు. ఒకసారి 1912లో శరణానంద బాబాను దర్శించినప్పుడు తన తండ్రి వాపుతెవులు (డ్రాప్సీ×××) వ్యాధితో బాధపడుతున్నాడు. తన తండ్రి బాబా వద్దకు తీసికొనివచ్చి ఉంటే బాగుండేది కదా అని మనస్సులో అనుకున్నాడు. బాబా వెంటనే అతని మనస్సు కనిపెట్టి, “మరి ఎందుకు తీసుకురాలేదు” అని ప్రశ్నించారు. “మహమ్మదీయుడైన బాబా వద్దకు రావడానికి తన తండ్రి అంగీకరిస్తాడో లేదో” అని తలచాడు, వెంటనే బాబా,



"నేను బ్రాహ్మణుడను కానా?" అని ప్రశ్నించారు. దీనితో బాబా బ్రాహ్మణులని, శరణానంద దృఢపరచుకున్నాడు. ఒక సందర్భంలో బాబా, మహల్సాపతితో తమ తలిదండ్రులు పత్రీకి చెందిన యజుర్వేద బ్రాహ్మణులని చెప్పడం, మరో సందర్భంలో "నేను స్వచ్ఛమైన బ్రాహ్మణుడను. ఈ బ్రాహ్మణుడు లక్షలాది ప్రజలను శుభ్రమార్గంలో నడిపించి, వారిని గమ్యం చేర్చగలడు. ఇది బ్రాహ్మణమశీదు" అని చెప్పడం, మరోసారి పత్రికి చెందిన భక్తుడొకడు బాబాను దర్శించినప్పుడు అతనిని అప్పుడు పత్రీలో నివసిస్తున్న కొందరు పెద్దమనుష్యుల యోగక్షేమాలు పేరుపేరునా పరామర్శించడం, మొదలైనవన్నీ బాబా పత్రీకి చెందిన యజుర్వేదీయ బ్రాహ్మణుడని నమ్మకానికి దోహదపడ్డాయి. మరోసారి శరణానంద, మహల్సాపతి బాబా సన్నిధిలో ఉన్నప్పుడు, "పత్రీనుండి వెళ్ళు దారి చాలా కఠినమైనది. పత్రీ నుండి మానవత్, సేలూ, జాల్నా దాటుకుంటూ వెళ్ళి పైఠాన్, ఔరంగాబాద్ చేరాలి. నేనొకసారి ఈ మార్గం గుండా ప్రయాణించాను. ఎనిమిది రోజులు పట్టింది. రోజంతా కాలినడకన ప్రయాణం, రాత్రి పచ్చిక మీదే పడక!" అన్నారు. అంటే వారొకప్పుడు ఆ మార్గంలో గురువు వెంట ప్రయాణించినట్లు స్పష్టంగా చెప్పినట్లే కదా ! అంతేకాక శరణానంద స్వామితో బాబా, స్వయంగా తమ గురువు పేరు రోషన్ షా మియా అని చెప్పడం, తరచు, తమ సంభాషణలో పత్రీ, మానవత్, సేలూ.



జాల్నాపూర్, ఔరంగాబాద్ పేర్లూ వస్తూ ఉండడం మొదలైనవన్నీ, బాబా పత్రీకి చెందిన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి ఒక ముస్లిం గురువుచే జ్ఞానిగా రూపొందించబడ్డారని, అనుకోవడానికి శరణానందకు తోడ్పడ్డాయి. అందుకే బాబా జన్మవృత్తాంతం క్రింది విధంగా చెప్పాడు.

పత్రి అను గ్రామం మహారాష్ట్రలో, మరట్వాడా ప్రాంతంలో, మానవత్‌కు 5 మైళ్ళ దూరంలో ఉంది. పత్రీలోని ఒక యజుర్వేద దేశస్థ బ్రాహ్మణునికి ముగ్గురు కుమారులున్నారు. పెద్దవాడే సాయిబాబా. సాయిబాబాకు అయిదు సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు, ఒక ఫకీరు అతని ఇంటికి వచ్చి, "నాది నాకిచ్చేయ్" అన్నారు. అందుకా బ్రాహ్మణుడు "నా దగ్గరమున్నదంతా మీదే కదా స్వామీ" అని బదులుచెప్పాడు. ఫకీరు వారి పెద్దకుమారుని తీసుకొనివెళ్ళిపోయాడు. నాలుగు సంవత్సరాల తర్వాత, ఫకీరు బాలునితో వచ్చి, వారికి కన్పించి, తిరిగి బాలుని తీసుకొని వెళ్ళిపోయాడు. తర్వాత వాళ్ళేమైంది ఎవ్వరికీ తెలియదు. బహుశా బాబా, తాము ప్రయాణించినట్లు పైన చెప్పిన మార్గంలో ప్రయాణించి, ఔరంగాబాద్ చేరి, అక్కడ తమ గురువు దగ్గర 12 సం॥లు గడిపి, తర్వాత 18 సం॥ల బాలయోగిగా శిరిడీలోని వేపచెట్టు క్రింద ప్రత్యక్షమై ఉంటారని భావించబడుతుంది.

పై కథకు లభించిన ఆధారాలు, ఋజువులు :

బాబా పూర్వాశ్రమ నామం :

ప్రముఖ సాయిభక్తుడైన విశ్వాస్‌ఖేర్ అను చరిత్రకారుడు సాయి జన్మరహస్య భేదనకు పూనుకొని పరిశోధనలు జరిపినట్లు, పైన వ్రాయడం

జరిగింది కదా ! 1975లో అతను 'పత్రీ' గ్రామానికి వెళ్ళి పరిశోధనలు జరిపి, అక్కడ నివసించిన దేశస్థ యజుర్వేద బ్రాహ్మణులైన భూసరి కటుంబంలో సాయిబాబా జన్మించినట్లు తేల్చాడు. అప్పుడు సాయిబాబా మూడవ తరంవాడైన రఘునాథ్ మహారుద్ర భూసరి అనునతడు ఉస్మానియా యూనివర్శిటీలో మరాఠీ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఉండేవాడు. ఖేర్ అతని జాడ తెలిసికొని, వారిని కలిసి వారతో సంభాషించాడు. భూసరి కుటుంబ వంశవృక్షం సంపాదించాడు. దాని ప్రకారం రఘునాథ్ పితామహులైన రఘుపతి భూసరికి నలుగురు సోదరులు. వారి పేర్లు, దాదా, హరిభావు, అంబాదస్ మరియు బల్వంత్. చివరికి ముగ్గురు చిన్నప్పుడే ఇల్లు విడిచి వెళ్ళిపోయారు. అంబాదాస్, బల్వంత్‌లు తమ అదృష్టాన్ని వెతుక్కుంటూ వెళ్ళిపోయారు, హరిభావు భగవంతుని అన్వేషిస్తూ వెళ్ళిపోయాడు. ఈ వివరాలన్నీ రఘునాథ్ తన చిన్నప్పుడు తన నాన్నమ్మద్వారా దెలుసుకున్నట్లు చెప్పాడు. దీనిని బట్టి "హరిభావే" సాయిబాబా అయి ఉంటారని ఖేర్ నమ్మరు.

ఖేర్, తర్వాత దినకరరావు అను న్యాయవాది ఇంట్లో కొన్ని రోజులు బస చేసి, విషయాలు సేకరించారు. పత్రీకి చెందిన భక్తుడు బాబాను దర్శించుకున్నప్పుడు బాబా పత్రీకి చెందిన కొందరు పెద్ద మనుష్యుల యోగక్షేమాలు విచారించినట్లు మనం తెలుసుకున్నాం కదా ! వారు విచారిచినది దినకర్‌రావు పితామహులౌన శ్యామారావు. అతని సోదరుడైన భలే రావుల గురించేనని వారిరువురూ సాయిబాబా (హరిభావు) యొక్క సమకాలీకులని (×××) కూడా ఖేర్ తెలుసుకున్నాడు. ముందు చెప్పిన ప్రొఫెసర్ రఘునాథభూసరి పినతండ్రి కుమారుడైన బావుభూసరి, దుర్భర పరిస్థితిలలో



మరణించినప్పుడు దినకరరావు తండ్రి'' సాయిబాబా వంశాంకరానికేం గతి పట్టింది? అని వ్యాఖ్యానించినట్లు దినకరరావు ద్వారా తెలుసుకున్నాడు. తర్వాత దినకరరావు ఇంటికొచ్చిన కొందరు మహమ్మదీయ క్లయింట్లను బాబా విషయం విచారించాడు. వారు సాయిబాబా తలితండ్రులు పత్రీకి చెందిన బ్రాహ్మణులని, వారు తమకు తమ పూర్వీకుల నుండి ఎరుగుదుమని దృఢపరిచారు.

పైన చెప్పిన ఆధారాలే కాక, పత్రీ అంచునే, 'లెండీ' అనునది ప్రవహిస్తూ ఉండడం ఖేర్ గమనించాడు. బహుశా షిరిడీలోని తోటకు దీని జ్ఞాపకార్థమే 'లెండీతోట' అని పేరుపెట్టి ఉంటారని అనుకోవడానికి ఆస్కారముంది. పత్రీలోనూ, పత్రి పరిసరాలలోనూ, అంటే మరట్వాడా ప్రాంతంలో చిన్నలు, పెద్దలూ, నాగరికులు అందరూ ఒకే యాసతో మరాఠీ మాట్లాడేవారట. బాబా కూడ ఇదే యాసతో మరాఠీ మాట్లాడేవారని భక్తుల ద్వారా తెలుసుకున్నాడు. దీని ద్వారా బాబా పత్రీకి చెందినవారని రూఢి అవుతుంది. (ఉదా ॥ ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణా, ఉత్తరకోస్తా, దక్షిణకోస్తా, రాయలసీమ ప్రాంతంలో జన్మించిన నలుగురు ఒకచోట చేరి మాటాడుకుంటున్నారని అనుకుందాం. వారు మాట్లాడే తెలుగు యాసనుబట్టి, ఎవరెవరు ఏయే ప్రాంతాలకు చెందినవారో సులభంగా మనం గుర్తించవచ్చు. అలాగే మహారాష్ట్రలో ఒక్కొక్క ప్రాంతంవారు, ఒక్కొక్క యాసతో మరాఠీ మాట్లాడటంవల్ల ఎవరు ఏ ప్రాంతానికి చెందినవారో సులభంగా గుర్తించవచ్చు.)

ఇవేగాక, పత్రీలోనున్న అన్ని బ్రాహ్మణకుటుంబాలకు, రేణుకాదేవి కానీ, యోగీశ్వరికానీ కులదైవమైతే, భూసరి కుటుంబానికి మాత్రం 'హనుమాన్'

కులదైవంగా ఉండటం బాబాకు హనుమాన్ అంటే భక్తి ప్రపత్తులు ఉండటమే కాక, తమ మహాసమాధికి ముందు రెండు సార్లు శ్రీరామవిజయాన్ని వజే అను భక్తునిచేత పారాయణ చేయించి వినడం, శ్రీరామనవమి రోజు, ఉరుసు, చందనోత్సవాలు జరిపించమని ఆదేశించడం, బాబా చావడికి వెళ్లేప్పుడు, తిరిగి వచ్చేప్పుడు, మరుతీ దేవాలయం వైపు చూస్తూ, ఏవో సంజ్ఞలు చేస్తూ ఉండటం, తమను తమ పెద్దలు మారుతికి అప్పగించారని, మారుతి, తమ సోదరుడని చెప్పడం మొదలైనవన్నీ 'హరిభావే' సాయిబాబా అన్ని నమ్మడానికి దోహదపడ్డాయి. అందుకే ఖేర్ 'పత్రీ'లో 'శ్రీసాయిస్మారకసమితి' అను సంస్థను స్థాపించి, దాని పేరుతో శిథిలావస్థలో నుండిన, సాయిబాబా నివసించిన ఇంటిని, ప్రస్తుత వారసుడైన ప్రొ॥రఘునాథ్ మహారుద్ర భూసరి నుంఇ, కొనుగోలు చేసి, దానిని పునరుద్ధరించి, అక్కడొక మందిరం నిర్మించి, బాబా విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. అక్కడ ఇప్పుడు, నిత్యపూజలు జరుగుతుండటం మనం చూడవచ్చు.

(సశేషం)





విశ్వాసంతో బాటు, మన ఆత్మను (మనసును) ఆయనలో పూర్తిగా లీనం చేయగలిగి ఉండాలి !

ప్రస్తుతం షిరిడీ క్షేత్రంలో సాయి సమాధి మందిరం వెలసిన అతి పవిత్రమైన స్థలం గురించి కొన్ని విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం. శ్రీసాయినాథుని జీవితం గురించి, భక్తాగ్రగణ్యులు తెలిపిన విషయాలలో ఈ క్రింది విధంగా వ్రాయబడివుంది. దీనిని జాగ్రత్తగా పరిశీలించి, అవగాహన చేసుకోవాడానికి ప్రయత్నిద్దాం !

"బాబా ! ఒక్కొక్కసారి మూడు మైళ్ళలో ఉన్న 'రహతా'కో, 'నీమ్‌గావ్'కో వెళ్ళి వచ్చేవారు. ఒకసారి రహతా అనే గ్రామంనుండి పూలమొక్కల విత్తనాలు తెచ్చి, ఆ వేపచెట్టు ప్రక్కన నేలను త్రవ్వి, వాటిని నారువేసారు. 'వామన్' అనే కుమ్మరి ఆయనకు రెండు కుండలు ఇచ్చాడు. ఆయన తమకు కాల్చనివి కావాలంటే, అలాగే సమర్పించాడు. ఆ రోజు నుండి అతని బేరం అద్భుతం కాసాగింది. అందువలన అతడు ఆయనకు రోజూ రెండు కాల్చని కుండలను ఇస్తూండేవాడు. ఆయన వాటితో ఆ ఊరి బావి నుండి నీరు తెచ్చి మొక్కలకు పోసి సాయంత్రం అయ్యేసరికి ఆ కుండల్ని వేపచెట్టు క్రింద పెట్టగానే అవి విచ్చిపోయేవి! మూడు సం॥లలో అక్కడ చక్కని తోట మొలిచింది !

ఇది వారు చెప్పిన వృత్తాంతం !

అయితే ఇది సాధారణ విషయంగా అనిపించినా, దీంట్లో చాలా

రహస్యాలున్నాయని మనం గ్రహించవచ్చు ! ఆయన రహతా నుండి తెచ్చిన పూలవిత్తనాలు అంటే అవే గురుభక్తి అనే బీజాలు విత్తనాలు అన్నమాట ! వాటిని వేపచెట్టు ప్రక్కనే ఉన్న నేలను త్రవ్వి నాటినారు అంటే తన గురుస్థానమైన వేపచెట్టు ప్రక్కన మనస్సు అనే నేలలో నాటినారు ! మనస్సులో గురుభక్తిని నెలకొల్పారని అర్థం ! మరి ఆ గురుభక్తి అనే విత్తనాలు మొలకెత్తాలి అంటే నీరు కావాలి కదా ! అదే తమ మహాశక్తి సంపన్నమైన నూతినుండి ఆవిర్భవించిన దివ్యలీలలు అనే నీటితో తడిపినారు ! గురుభక్తిని మొలకెత్తింపజేసారు ! మూడు సం॥లలో అక్కడ మొలిచింది చక్కని పూలవనం ! అంటే ఈనాడు ఖండఖండాంతరాలలో ఆయన యొక్క భక్తవరులు అనే పుష్పాలను వ్యాపించేలా చేసిన తపోవనం అని మనం గ్రహించాలి ! ఆ పవిత్రమైన తపోవనస్థలంలోనే ఈనాటి ఆయన సమాధి మందిరం విరాజిల్లుచున్నదని భక్తకోటికి తెలుసుకదా!

శ్రీసాయీశ్వరుని ఈ రహస్యమైన చేష్టలో ఇంతటి పరమార్థమున్నదని ఆయన శరణాగతులకు మాత్రమే అర్థం కాగలదు ! మరి ఇంతటి పవిత్ర తపోవనాన్ని పోషించడానికి తనవంతు సహకరించిన వామన్ గురించి ఆలోచిద్దాం!

బాబా వామనుని ప్రతిరోజు రెండు కుండల్ని అడిగేవారు. అతడు పరమానందంతో ఆయన అడిగిన రెండు కుండల్ని ప్రతిరోజు ఇచ్చేవాడు. అయితే అవి సామాన్యమైన కుండలు కావు ! అవి **శ్రద్ధ, సహనం** అనేవని గ్రహించాలి. ఆ శ్రద్ధా, సహనాలనే రెండు కుండలతోనే దివ్యలీలలు అనే నీటిని తెచ్చి గురుభక్తి (విత్తనాల) ని అంకురింపజేయడం జరిగింది ! గురుభక్తి అభివృద్ధి చెందాలంటే శ్రద్ధ, సబూరీ అవసరమని ఈ రూపంగా సూచించారు.



మరొక విశేషమేమంటే బాబా అడిగినవి కాల్చిన కుండలు కాదట ! కాల్చని కుండలను మాత్రమే అడిగారు ! దీంట్లో ఉన్న ఆంతర్యం ఏమిటంటే కాల్చిని వాటికంటే కాల్చని కుండలు మరల తొందరగా, పూర్తిగా మట్టిలో కలిసిపోతాయి కదా ! మనస్సు అనే నేలనుండి మట్టి తయారైన ఆ శ్రద్ధ, సహనాలు అనే కాల్చని కుండలు మరల ఆ నేలలోనే లీనమైపోతాయి ! అయిపోవాలి కూడా ! ప్రతిరోజు ఆ కుండల్ని ఆ వేపచెట్టు ప్రక్కనే పెట్టడం, అవి విచ్చి (పగలి)పోయి, ఆ నేలలోనే కలిసిపోవడంలో గల అంతర్యం అదే మరి !

ఈ విధముగా తన దివ్యమహిమతో పెంచిన పవిత్ర షిరిడీ క్షేత్ర తపోవనస్థలంలో దేదీప్యమానంగా అలరారుతున్న సమాధి మందిరం సందర్శనం కోసం విచ్చేయుచున్న భక్త పుష్పాలను తిలకిస్తుంటే ఎంతటి తన్మయత్వం కలుగుతుందో భక్తులకు చెప్పనక్కరలేదు కదా !

ఇక కొన్ని సంఘటనలు మనం ఊహించడానికే అసాధ్యం ! ఆ ఘటనాఘటన సమర్థులకే తెలుసు ! అయినా మన శక్తిమేరకు ఆయన అనుగ్రహంతో గ్రహించడానికి పూనుకోవడంలో తప్పులేదేమో !

సాయీశ్వరుడు కుండలను వామన్‌ని అడిగాడు కదా ! అతడు ఇస్తూ ఉండేవాడు ! ఆ వామన్‌నే ఎందుకడిగాడు? అతని పేరులో కూడా రహస్యం ఏదైనా దాగి ఉన్నదా ? అని ఆలోచిస్తే ఉన్నదేమో అనిపిస్తుంది. ఎలా అంటే అతని పేరు వామన్. వా=వాయి, అంటే నోరు; వాక్కు (మాట) మన్=మనస్సు పవిత్రమైన వాక్కు, మనస్సుకలిగిన వామన్ వానిచేత తయారు చేయించబడిన కర్మ కుండలవి. అంటే మనోవాక్కాయకర్మలద్వారా త్రికరణశుద్ధిగా శ్రద్ధ

సహనాలు అనే ఆ రెంటిని కుండల్ని తనకు అర్పించమని అడిగి మరీ తీసుకున్న మహనీయుడు సాయినాథుడు ! ఇదే ఆయన చూపే భక్తవాత్సల్యం. ఆయన ఆజ్ఞాపించినట్లుగానే వామనుడు ఆయనకు ప్రతిరోజు వాటిని సమర్పిస్తూ తన జీవితాన్ని సార్థకం చేసుకున్న పుణ్యాత్ముడు!

ఈ విధంగా సాయి దివ్యమైన మాటల్లో, ఆచరణలో కొన్ని రహస్య సంకేతాలు ఉంటాయని గ్రహించగలగడానికి కూడా ఆయన దివ్యాశీస్సులు కావాలి సుమా !

కాబట్టి భక్తులారా ! సాయీశ్వరుని త్రికరణశుద్ధిగా నమ్మి, శ్రద్ధ, సబూరీలతో కొలిచే సాధుజనులకు ఆయన నిరంతరం చేదోడు, వాదోడుగా నిలిచి రక్షిస్తున్నాడనేది ముమ్మాటికీ నిజమే కదా !

**తే॥ దిన దినంబును కుండలఁ దెచ్చి యిచ్చి,**
**శాశ్వతాఖండ 'గురుభక్తి' చాటు కతన**
**'యోగి' కరుణా ప్రవాహాన, తోగినాడు !**
**ఎంత ధన్యుడో 'వామను' డెంచి చూడ !**

**శ్రీ సమర్థ సద్గురు సాయినాథ్ మహరాజ్‌కీ జై**
**సర్వేజనాస్సుఖినో భవంతు**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**




# పిలిచిన పిలుపే విశ్వవిఖ్యాతి గాంచిన వేళ !

## మహాభక్త భగత్ మహల్సాపతి జీవిత చరిత్ర

**సాయిదాసానుదాసు సురేంద్రబాబు,** కొవ్వూరు, నెల్లూరు జిల్లా

(గత సంచిక తరువాయి భాగం)




శిరిడీలో వచ్చిన తుఫాను తర్వాత వారి మకాం మశీదుకు మార్చబడిన విషయం కూడ మనకు తెలిసినదే ! మొదట బాబా నొక గొప్ప మహాత్మునిగా గుర్తించినవాడు మహల్సాపతే ! గుర్తించడమే గాక మొదటిసారిగా వారిని పూజించిన భాగ్యం కూడా మహల్సాపతికే దక్కింది. బాబాను తన గురువుగా ఎంచుకొని, మశీదుకు వెళ్ళి, వారి పాదాలకు, కంఠానికి చందనం పూసి, పూలతో పూజించి, వారికి పాలు సమర్పించెడివాడు. బాబా వాటిని సంతోషంగా స్వీకరించేవారు. క్రమేణా ఇది నిత్యపూజగా రూపొందింది. ప్రతి దినం బాబా పాదాలకు, కంఠానికి తర్వాత నొసటికి చందనం పూసి వారిని పూజించేవాడు. బాబా సంతోషంగా ఈ పూజను స్వీకరించేవారు. బాబాను పూజించే భాగ్యం మొదట ఎవరికి దక్కలేదు. భక్తులెవరైనా వచ్చి తమను పూజించడానికి అనుమతించమని ప్రార్థిస్తే "వెళ్ళి ఆ స్తంభాన్ని పూజించుకో!" అని చెప్పేవారు. కానీ భక్తులు స్తంభాన్ని పూజించడం ఇష్టపడక, వారికి నమస్కరించి వెళ్ళిపోయేవారు.



మహల్సాపతి జన్మతః విరాగి ! వైరాగ్యభావం, అధ్యాత్మికత, అపరిగ్రహణము వారికి పుట్టుకతోనే వచ్చాయి. ఎవరూ ఏదిచ్చినా స్వీకరించేవాడు కాదు. చివరకు బాబా నుండి కూడా ! బాబాకు ప్రతిదినం దక్షిణరూపంలో ఎంతో డబ్బు వస్తుండేది. బాబా ఈ డబ్బంతా భక్తులకు పంచిపెట్టేవారు. ఒక్కొక్కరికి ఒక్క రూపాయి నుండి 55 రూపాయల వరకు ఇస్తు వుండేవారు. ఎన్నోసార్లు మహల్సాపతిని దగ్గరకు పిలిచి, "అరే ! భగత్ ! ఈ మూడు రూపాయలు తీసుకో !" ప్రతిదినం మూడు రూపాయల వరకు ఇస్తూ వుంటాను. నీవు గొప్ప ధనవంతుడవౌతావు. నీ జీవితం సుఖమయం అవుతుంది. అందరూ నీ దగ్గరకొచ్చి నీ అభిమానం కోసం అర్రులు చాచుతారు!" అనేవారు. కానీ మహల్సాపతి నిరాకరిస్తూ, "బాబా ! నాకివేమీ అక్కరలేదు. చిరకాలం మీ పాదాలు పూజించుకునే భాగ్యం మాత్రం కలుగజేయండి" అనేవాడు. ఇలా మహల్సాపతికి ఎవరేమిచ్చినా పరిగ్రహించేవాడు కాదు. విలాస వస్తువులను దరిచేరనిచ్చేవాడు కాదు. ఎంతటి దుర్భరపరిస్థితులనైనా సహించి భరించేవాడు. ఒకసారి చింతామణి రావు అనే భక్తుడు మహల్సాపతి పేదరికాన్ని గమనించి వెయ్యి రూపాయలు ఇవ్వబోయాడు. మహల్సాపతి నిరాకరించాడు. మరోసారి యం.ఎ. సేట్ అనే భక్తుడు వంద రూపాయలు, మరొక భక్తుడు పదిరూపాయలు ఇవ్వబోయారు. వాటిని కూడా మహల్సాపతి నిరాకరించాడు. ఇలా ఎంతటి దుర్భర పరిస్థితులెదురైనా కుటుంబంతో సహా పస్తులుండేవారే తప్ప ఎవరినుంచి ఏమీ స్వీకరించేవాడు కాదు. బాబా వారి కృపతో





మహల్సాపతిని కాపాడుతూ వచ్చారు. ఒక్కొక్కసారి మహల్సాపతి విధిగా ఆచరిస్తున్న అపరిగ్రహ వ్రతాన్ని సడలించుకునేటట్లు బాబాయే చేసేవారు. అందుకు ఈ క్రింది సంఘటనే నిదర్శనం.

ఒకసారి మహల్సాపతి దుర్భరపరిస్థితులకు లోనయ్యాడు. రెండు మూడు రోజులు కుటుంబమంతా పస్తులున్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రమాదానికి గురయ్యే సూచనలు కన్పించాయి. ఇది గమనించి కాకాసాహెబ్ దీక్షిత్ అతనికి ఎలాగైనా సహాయం చెయ్యాలని సంకల్పించాడు. కానీ అది బాబా ద్వారా మాత్రమే వీలవుతుందని అతనికి తెలుసు. పదిరూపాయల నోటు ఒక కవరులో పెట్టి, దానిని బాబా చెంతకు తీసుకొనివెళ్లి, ఉపోద్ఘాతమేమీ లేకుండా, కవరును చూపిస్తూ "దీనిని పంపమంటారా?" అని అడిగాడు. బాబా "అలాగే పంపు" అన్నారు. దీక్షిత్ ఆ కవరును ఎవరికి పంపదలచాడో సర్వజ్ఞుడైన బాబాకుతెలుసు. ఆ కవరు తీసుకొని తన దగ్గరకు వస్తాడని కూడ బాబాకు తెలుసు. అందుకే ఆ కవరు మహల్సాపతికి చేరడానికి గంట ముందు బాబా మహల్సాపతి భార్యకు దృశ్యరూపంలో కనపడి, "నేను మీ ఇంటికి వస్తున్నాను. నన్ను నిరాకరించవద్దని నీ భర్తకు చెప్పు" అన్నారు. ఆమె ఈ విషయం తన భర్తతో వెంటనే తెలియజేసింది. కవరు వచ్చిన వెంటనే, బాబాయే కవరు రూపంలో ఇంటికి వచ్చాడని గ్రహించి, దానిని తీసుకున్నాడు. బాబా ఇలా తాత్కాలికంగానైనా మహల్సాపతి ఇంటి పరిస్థితులు చక్కదిద్దారు.

మహల్సాపతి, తాత్యాకోతే పాటిల్‌లు బాబాతో పాటు మశీదులో నిద్రించేవారని మనకు తెలుసు. ముగ్గురూ మూడు దిక్కులలో అంటే తూర్పు, పడమర, దక్షిణంవైపు తలలు పెట్టుకొని, వారి కాళ్ళు మధ్యకు వచ్చేలా పడుకొని నిద్రించేవారు. రాత్రి బాగా పొద్దుపోయేంతవరకు బాబా వారితో మాట్లాడుతూ గడిపేవారు. అతిగా నిద్రించకుండా, మితంగా భోజనం చెయ్యమని బోధించేవారు. రాత్రిళ్ళు ఎక్కువసేపు నిద్రించకుండా భగవంతుని నామస్మరణతో గడపమని కూడా చెప్పేవారు. ఇలా 14 సం॥గడిచిన తరువాత తాత్యా తల్లి బయిజాబాయి మరణించి ఇంటిబాధ్యత తాత్యాపై పడింది. అప్పటినుండి తాత్యా ఇంటిలోనే నిద్రించేవాడు. మహల్సాపతి మాత్రం బాబా సమాధి పర్యంతం నిద్రించేవాడు. మధ్యలో ఒక సంవత్సరం పాటు మహల్సాపతి ఇంటిలో నిద్రించటం జరిగింది. అదెలా జరిగిందో క్రింద చదివితే తెలుస్తుంది.

1896వ సం॥ జన్మాష్టమి రోజున బాబా మహల్సాపతితో "అరే భగత్ ! ఈ ఫకీరు మాటలు విను. అది ఎప్పుడూ సత్యాలే అయి ఉంటాయి. నీవు ప్రతిదినం ఇక్కడ నిద్రిస్తున్నావు. నీకేమో ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు. ఆడపిల్లలు చింత పండులాంటివారు. మగ పిల్లవాడు మామిడిపండు లాంటివాడు. కాబట్టి నీవు వెళ్ళి ఇంట్లో పడుకో ! నీకు తప్పక మగపిల్లవాడు పుడతాడు" అన్నారు. కానీ మహల్సాపతికి సంసారాన్ని పెంచుకోవడం ఇష్టం లేదు. అందువల్ల నిరాకరించాడు. కానీ అతని స్నేహితుడైన కాశీరాం షింపీ, బాబా మాటలు నిర్లక్ష్యం చెయ్యడం మంచిది కాదని హితవు పలికి, అతనిని బలవంతంగా ఇంట్లో విడిచి వచ్చాడు. బాబా మాటలు వమ్ము కావు కదా ! 1877 జన్మాష్టమినాటికి అతనికొక మగపిల్లవాడు జన్మించాడు. తిరిగి



మహల్సాపతి మశీదులో నిద్రించడం మొదలుపెట్టాడు.

బాబా మహల్సాపతికి అతి కఠినమైన విధులు అప్పగించేవారు. మహల్సాపతి తప్ప మరే ఇతర భక్తులు చేయలేనటువంటివి ! రాత్రిళ్ళు అతనితో, "అరే భగత్ ! నీవు నిద్రపోవద్దు. లేచి కూర్చొని నా హృదయంపై చెయ్యి పెట్టు. నేనెప్పుడు అల్లా స్మరణం చేస్తూ ఒక విధమైన సమాధిస్థితిలో ఉంటాను. అప్పుడు నా గుండె ఒక ప్రత్యేకరీతిలో కొట్టుకుంటూ వుండటం నీవు గమనిస్తావు. ఎప్పుడైతే నామస్మరణ ఆగిపోతుందో అప్పుడు నా గుండె మామూలు కొట్టుకోవటం ప్రారంభించి నేను సహజనిద్రలోకి జారుకుంటాను. అప్పుడు నన్ను తట్టి లేపు!" అని చెప్పేవారు. మహల్సాపతి బాబా గుండెలపై చెయ్యిపెట్టి దాదాపు రాత్రంతా మేలుకునే వుండేవాడు. ఇలా రాత్రంతా బాబా తమ భక్తుల ఉద్ధరణతోనూ, మహల్సాపతి బాబా సేవలోనూ ఇద్దరూ మేలుకునే ఉండేవారు. ఇలా చేయడం ఒక్క మహల్సాపతికే సాధ్యమౌతుందని బాబాకు తెలుసు. అందుకే ఆ పనిని మహల్సాపతికే అప్పగించేవారు. మహల్సాపతి గొప్ప విరాగే గాక ఇంద్రియ నిగ్రహం కూడా కలిగి ఉండేవాడు. ఒక్కొక్కసారి పక్షంరోజులపాటు నిరాహారంగా గడిపే శక్తి అతనికుండేది. కానీ నిద్రను మాత్రం నిరవధికంగా ఆపగలిగే శక్తి కొరవడింది. అప్పుడప్పుడు నిద్రలోకి జారుకుని, తూలిపడబోయేవాడు. అప్పుడు బాబా అతనిని లేపి జాగరూకతతో ఉండాలని ఆదేశించేవారు.

(సశేషం)

( 'సాయిభక్తమాల' అను గ్రంథము నుండి .... )

# బలరాం ధురందర్

**చరణ్ జనమంచి**

*(గత సంచిక తరువాత భాగం)*

| | | |
|---|---|---|
| **అసలు పేరు** | : | **బలరాం ధురందర్** |
| **పిలవబడిన పేరు** | : | **ధురందర్** |
| **వృత్తి** | : | **న్యాయవాది** |

విఠోబా భక్తుడైన బలరాం ధురందర్ ఆధ్యాత్మిక చింతన కలిగిన వ్యక్తి. ఎన్నో వేదాంత గ్రంథములు చదివెను. న్యాయవాదిగా తన వృత్తిని కొనసాగిస్తూ తన జాతి వారికోసం ఎంతో సేవ చేసెను. ధురందర్ సోదరులు బాలాజీ, వామనరావులు బాబా దర్శనపు అనుభవం బలరాంతో పంచుకొనిరి. ఆ కుటుంబంలోని వారందరకూ బాబాను దర్శించటానికి కోరిక కలిగెను. వీరి రాకమునుపే బాబా **"ఈ రోజు దర్బారుకు నా భక్తసోదరులు వచ్చుచున్నారని, ఏర్పాటు చేయమని"** పలికిరి.

ధురందర్ సోదరులు షిరిడీచేరిరి. వారందరూ బాబాను తనివితీరా దర్శించుకొనిరి. బాబా వారితో **"గత 60 సం॥ల నుంచి మీకు నాతో సంబంధమున్నది"** అనిరి.

మధ్యాహ్న భోజనం తరువాత వారు మళ్లీ బాబా దర్శనం కొరకు ద్వారకామాయి వచ్చిరి. బాబా తాము పీల్చుచున్న చిలుమును బాలారామునకు ఇచ్చి పీల్చమనెను. అలవాటు లేనిదైనా బాబా ఆజ్ఞ ప్రకారం దానిని పీల్చి బాబాకు ఇచ్చివేసెను. అతను పడుతున్న ఉబ్బసము వ్యాధి



తగ్గుట ప్రారంభ మయ్యెను. 6 సం॥ల తరువాత బాబా మహాసమాధి చెందిన రోజు తిరిగి బలరాంనకు ఆ జబ్బు వచ్చెను. గురువారం రోజున వచ్చిన బలరాం సోదరులకు చావడి ఉత్సవం చూడగలిగే భాగ్యం కలిగెను. బలరాం దురంధర్‌కు ఆరతి సమయంలో బాబా పాండురంగని వలె దర్శనమిచ్చెను.

బలరాం దురంధర్ మహారాష్ట్రలో గొప్పపాండురంగ భక్తుడైన తుకారాం యొక్క జీవితచరిత్ర మరాఠీభాషలో వ్రాసెను. అది ప్రచురణకు ముందే చనిపోయెను. 1928లో ధురందర్ సోదరులు దానిని ముద్రించిరి.


(సశేషం)

## ఊది ధారణ మంత్రం

**మహాగ్రహ పీడాం మహోత్పాత పీడాం**
**మహారోగ పీడాం మహాతీవ్ర పీడాం**
**హరిత్యాసుతే ద్వారకామాయి భస్మ**
**నమస్తే గురుశ్రేష్ఠ సాయీశ్వరాయ**
**శ్రీకరం నిత్యం శుభకరం దివ్యం పరమం పవిత్రం**
**మహాపాప హరం బాబా విభూతిం ధారాయామ్యహం**
**సాయిబాబా విభూతిం ధారాయామ్యహం॰**
**పరమం పవిత్రం బాబా విభూతిం**
**పరమం విచిత్రం లీలా విభూతిం**
**పరమార్థ ఇష్టార్థ మోక్ష ప్రదాతం**
**బాబా విభూతిం ఇదమాశ్రయామి**
**సాయిబాబా విభూతిం మనసాస్మరామి ।పరమం॥ (3)**

# ఔదుంబర వృక్ష మహిమ

సాహిత్యరత్న **ఎ.వి.రమణకవి, శ్రీకాళహస్తి**



ఔదుంబరవృక్షమనగా మేడిచెట్టు. అది కల్పవృక్షం అనగా కోరికలను తీర్చే వృక్షము. దాని మహిమను లోకమునకు చాటి పదిమందికి ఉపయోగపడాలను వత్సల కల్పము శ్రీదత్తాత్రేయుల అవతారములలో ద్వితీయ అవతారులై జన్మించిన శ్రీనృసింహ సరస్వతీ స్వామివారు తన కాలములో 'నరసింహవాడి'లో కృష్ణాతీరమందు ఔదుంబర వృక్షాన్నాశ్రయించి 12 సంవత్సరములు తపమాచరించినట్లు శ్రీగురుచరిత్ర ద్వారా తెలియుచున్నది.

ఔదుంబర మహిమకు మూల కారణం శ్రీమహాలక్ష్మిదేవి శ్రీనృసింహుడు. భక్తుల నుద్ధరించుటకు తన చేతిగోళ్లతో హిరణ్యకశ్యపుని పొట్ట చీల్చి లోకహితము చేశారు. కాని వాని పొట్టను చీల్చినందున ఈ రాక్షసుని విషం నరశింహుని వ్రేళ్ళకు సోకి అతనికి తాపమును కల్గించెను. ఆ తాప శాంతికి శ్రీమహాలక్ష్మి ఔదుంబర ఫలములందుకొని వ్రేళ్ళకు తొడిగింది. ఆ కారణమున అతని విషతాపం చల్లారెను. శ్రీలక్ష్మీనరసింహులు ప్రసన్నమై ఆ వృక్షమునకు ఈ క్రింది వరములిచ్చిరి.

ఆ వృక్షరాజు ఎల్లప్పుడు అనేకానేక ఫలములతో తేజోవంతమై కల్పవృక్షంగా ఈ భూలోకంలో వర్ధిల్లాలని భక్తి శ్రద్ధలతో దానిని సేవించిన వారికి వారి కోరికలన్ని శ్రీఘ్రముగా నెఱవేరుతాయని విషబాధతో సతమతమయ్యేవారు దాని సేవలో శాంతి పొందుతారని అనేక కారణములతో



పాపము లాచరించువారికి పాపములు సైతం దూరమైపోతాయని వధువు పుణ్యవతి అగుటయేగాక వంధ్యలు కూడ సంతానం పొందుతారని శ్రీమంతుడు కూడ దైన్యస్థితిలో వుంటే వారి దైన్యత తొలగిపోవునని ఔదుంబర వృక్షచ్ఛాయ సమీప నీటిలో స్నానము చేసినవారికి గంగా స్నానఫలము లభిస్తుందని ఆ వృక్షఛాయలో తపోనిష్ఠలు చేసినా 'సిద్ధి' కలుగుతుందని దానికి పూజలు చేసిన దీర్ఘరోగములేగాక బ్రహ్మహత్యాదోషములు సైతం తొలగునని తాను మహాలక్ష్మి సమేతముగా యుండుటయే గాక సర్వదేవతలు నివసిస్తారని చెప్పిరి.

శ్రీదత్తాత్రేయులే శ్రీనృసింహ సరస్వతి యను పేరుతో మానవరూపంలో యతీంద్రునిగా అవతరించి భక్తులను తరింపజేయుటకు తీర్థములను పవిత్రం చేయుటకు వచ్చిరి.

శ్రీనృసింహ సరస్వతి భౌతిక శరీరం చాలించిన తరువాత కూడ అదృశ్యంగా శతాబ్ధములుగా ఆ వృక్షమునందు వున్నారు. కావున భక్తులందరు ఈ ఔదుంబర వృక్షమునకు 108 ప్రదక్షిణములు చేస్తూవుంటారు.

జై గురుదత్తా – ఓం సాయిరాం □

## శ్రీసాయి ప్రచార ప్రతినిధులు కావాలి

**శ్రీసాయిదర్శన్, శ్రీసాయిదర్శన్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున మీ గ్రామములో / మీ పట్టణములో నిస్వార్థసేవ చేయగల మహనీయులు కావలెను. వివరములకు ఈ దిగువ అడ్రసుకు వ్రాయండి.**

**SRI SAI DARSHAN CHARITABLE TRUST**
**Dammaiguda ,**
**Hyderabad - 500 083**
**Phone : 040-65640220 Cell : 98667 48099**

# విశుద్ధాత్మా, విశోధనః

– అక్కిరాజు రమాపతి రాజు

ఎవరి జీవితంలోనైనా సంతానం లేని వెలితిని మించిన వెలితి ఇంకొకటి ఉండదు. ఈ లోపం చాలా విచారకరమైన దిగులు కలిగిస్తుంది. వెత పుట్టిస్తుంది. దిగులు పుట్టిస్తుంది. జీవితంపట్ల ఒక అరుచి, చింత, దుఃఖం, అశాంతి, ఆశాభంగం, ఆశ్వాన రాహిత్యం కలిగిస్తుంది అది. జీవితమే నిరర్థకమూ వ్యర్థము అయిపోయిందనిపిస్తుంది.

తన రక్తం పంచుకుని పుట్టిన పసిబిడ్డల తొలిపలుకులు వినని అదృష్టం ఏమదృష్టం స్త్రీకైనా, పురుషునికైనా? ఆ చిన్నారుల చిరునవ్వులు, కేరింతలు, బుంగమూతులు లేత చేతులతో మెడగట్టిగా కావలించుకోవటాలు లేని బ్రతుకు అనుభవం మానవజీవితాన్ని ఎంత లోపభూయిష్టం చేస్తుంది?

బహుళ దుఃఖప్రదమైన, సతత ఆశాపీడితమైన, చింతావ్యాకులితమై విచారసంకులమైన జీవితంలో పసిపాపల లేత పెదవుల హాసోల్లాసాలే, అమాయకపు చిరునవ్వులే, అంధకార సముద్రయాత్రకు దీపగృహసంకేత స్తంభాలవంటివి. అందుకే గాబోలు శకుంతల అంటుంది దుష్యంతునితో 'ముత్యాలహారాల పచ్చకర్పూరం కస్తూరి, శరీరానికి అలదుకున్న చిక్కటి చందన లేపనము, పండు వెన్నెలకంటే కూడా కన్న కొడుకు కంఠం చుట్టూ చేతులు బిగించి గట్టిగా కౌగిలించుకోవడం అధిక సుఖప్రదమూ, సంతోషభరిత పారవశ్య అనుభూతి ప్రదమూ కదా మహారాజా ! నా మాటలు



నిజమో కాదో తెలుసుకోవాలంటే ఇడుగో వీడు నీ కన్న కొడుకు, వీణ్ణి గుండెల నిండా హత్తుకో' అని. తిరస్కృతి అయిన ఆమె అంతగా విచలితురాలు కాలేదు. కాని కన్న కొడుకును ఆ మహారాజు నిరాదరించడం ఏ మాత్రం ఓర్చుకోలేకపోయింది.

మహాభారతం ఆదిపర్వంలో నన్నయ్యగారు ఎంతో అందమైన గొప్ప పద్యాలు రాశారు. ఈ ఘట్టంలో, అట్లానే కవికుల గురువైన కాళిదాసు కూడా శకుంతలనూ, తన కన్నకొడుకైన భరతుణ్ణీ నిరాదరణకు గురిచేసినందుకు పశ్చాత్తప్తుడైన దుష్యంతుడి హృదయ వేదనను ఇట్లా వర్ణిస్తాడు. 'నా అదృష్టం ఏమదృష్టం ! లోకంలో నిజంగా అదృష్టవంతులు ఎవరంటే తండ్రిని చూసి చూడగానే నిమిత్తం లేకుండానే పాలపళ్ళు మొగ్గలు విరిసి నవ్వుపూలు చిన్నారి పెదవుల నిండా వలికిపోతుండగా అప్పటి దాకా దుమ్ము, ధూళితో ఆడుకుంటున్నవాడైనా బుడి బుడి బుడత నడకలతో వచ్చి కాళ్ళు వాటేసుకుని ఎత్తుకో అని నిర్భంధించి, తన ఒంటి దుమ్మును ఏ తండ్రికైతే కొడుకు అంటిస్తాడో, ఆ తండ్రిదే నిజంగా అదృష్టమంటేను.

సంతానంలేని తన దయనీయతను దశరథ మహారాజు ఎలా అనుభవించిందీ వాల్మీకి మహాకవి వర్ణించాడు. వానలు కురిసి నంతవరకు, వెన్నెల విరిసినంత వరకు, పువ్వులు పూసినంతవరకు, ఆకాశంలో నక్షత్రాలు మిలమిలలాడినంత వరకు, ఉదయాస్తమనాలున్నంత వరకు పసిపాపల బోసినవ్వులు పరమ ఐశ్వర్యప్రదాలు. వాటిని మహాకవులు వర్ణిస్తూనే ఉంటారు.

స్త్రీకైనా, పురుషుడికైనా భగవంతుడిచ్చే అపురూపమైన కానుక పాపాయి. భగవంతుడి సృష్టికి సాఫల్యం పాపాయి. ప్రతివారి జీవితంలోనూ

కొన్ని ఆనందప్రదమైనవీ, స్మరణమాత్రం చేతనే పులకింపచేసేవీ అయిన అనుభూతులు, పరమోల్లాసప్రదమైన క్షణాలు ఉంటాయి. తరువాత తరువాత సంసార తాపత్రయంలో పడి మరచిపోతారేమో గాని గుర్తుంచుకోరేమో గాని గానుగెద్దు పరిభ్రమణంలో కళ్లగంతలు కట్టుకుంటారేమోగాని జీవిత భాగస్వామి లేదా భాగస్వామిని, తన బ్రతుకు ఊత, తనతో మొట్టమొదట మొదట సన్నివేశాలలో మాట్లాడిన మాటలు ఎంతో ఆనందాన్ని ఇచ్చేవో గుర్తుంచుకోవాలి. మనసుకింత ఊరట కలిగిస్తాయి ఆ జ్ఞాపకాలు.

అట్లానే తన పిల్లలు మాటలు వస్తూ వస్తూ ఉన్న తరుణంలో తనతో సలిపే వినోదప్రసంగం, సంతోషక్రీడలు అనుభవించిన వ్యక్తికే విదితం. సంసారంలో సారం ఏదైనా ఉంటే ఇటువంటివే జీవిత సాఫల్యవరాలు.

సంతానంలేని సంతాపం చాలాకాలం అనుభవించాడు రతన్‌జీ షాపూర్జీవాడియా. ఆయన పార్శీ వ్యాపారి. ఈ కొదువ తప్ప అతడికి జీవితంలో లేనిదేమీ లేదు.

ఆయన వ్యాపారం చేసి చాలా ఆర్జించాడు. సజ్జనుడాయన. దానధర్మాలపట్ల ప్రీతి చిత్తంకలవాడు. గడచిన కాలంలో నైజాం నవాబు ఏలుబడిలోని మరాట్వాడా ప్రాంతంలోని నాందేడ్ పట్టణం ఆయన నివాసస్థలం. ఆయన గొప్ప ధనవంతుడు. పలుకుబడి గలవారు. ఇల్లూవాకిలీ తోటలూ, దొడ్లూ, పొలాలు భవనాలు విస్తారంగా కలవాడు.

ప్రశస్తమైన పశుసంపదకు హక్కుదారు ఆయన. ఆయన దగ్గర రకరకాల బండ్లు, వాహనాలు నిరంతరం సిద్ధంగా ఉండేవి. లోకమంతా ఆయన అదృష్టానికి ఎంతగానో మెచ్చుకొనేది. ఆయన కెటువంటి లోటు



లేదనుకొనేది. అబ్బ ! అదృష్టమంటే ఆయనదేరా ? అనుకొనేది బయటనుంచి చూస్తే ఆయన మనస్సులో అహోరాత్రాలూ ఒక చింత బాధిస్తున్న విషయం ఆయన ఇల్లాలుకు కూడా అంత నికరంగా తెలియదు.

ఆయన జీవితం మొగలిపువ్వు మంచిగంధపు చెట్టూ, చెరకు బతుకూ అయిపోయింది. మొగలికి పండు ఉండదు. మంచి గంధపుమానుకి పువ్వు పూయదు. చెరకుకి పువ్వులేదు. పండూ లేదు. ఈయన జీవితమూ అంతే, ఆయన బీదలపట్ల కనికరంగా కనపరచి అన్నదానాలు, వస్త్రదానాలు ఎన్నో చేస్తూండేవాడు. ఎందరినో ఆదుకుంటూ ఉండేవాడు. ఎందరి కన్నీటినో తుడిచి ఆదరించేవాడు. అయినా దేవుడు కరుణించలేదు.

పందికొక్కు పంటగాదెను తొలిచినట్లు నిరుత్సాహం అతణ్ణి లోలోన తొలచివేస్తూండేది. అపస్వరపు పాటలాగా, బొంగురుగొంతుతో ఉన్న త్రిలోకసుందరిలాగా, ఆర్ద్రతలేని ఓదార్పులాగా, భక్తిలేని స్తవంలాగా, నడవడికలేని ఆచార్య పురుషుడిలాగా, కంఠాభరణంలేని అలంకారంలాగా ఉంది తన బతుకు అనుకునేవాడు ఆయన.

ఇట్లా అతడి జీవితం సాగుతుండగా దాసగణు మహారాజు పరిచయం అయింది ఆయనకు. దాసగణు అంటే రతన్‌జీ ఎనలేని భక్తిగౌరవాలు ఏర్పడ్డాయి. ఆ రోజుల్లో దాసగణు మహారాజు ఊరూరా చిన్న పెద్ద నగరాలలో, పట్టణాలలో సాయికథలు, సాయిమహిమ, సాయికరుణ, సాయి ఔన్నత్యం హరికథాగానం చేస్తూండేవాడు. ఆయన సాయి దివ్య లీలలను 'స్తవనమంజరి' పేరిట పాటలుగా పద్యాలుగా కూర్చాడు. మహారాష్ట్ర

అంతటా ఈ స్తోత్రావళి చాలా ప్రచారం పొందింది.

రతన్‌జీ ఒకనాడు దాసగణు మహరాజ్ సన్నిధిలో తన ఆవేదనను వెళ్ళగ్రక్కాడు. ఆయన నిదానంగా ఆలోచించి భక్తిభావంతో ఆర్ద్ర మనస్కుడై వెళ్ళి 'షిరిడీసాయి మహాప్రభువును ఆశ్రయించవయ్యా !' అని సలహా చెప్పాడు. ఆ వేళా విశేషం ఎటువంటిదో కాని ఆ సలహా రతన్‌జీ హృదయానికి హత్తుకొనిపోయింది. షిరిడీ మహాప్రభువు చిత్తం కరిగిపోయేటట్లు వేడుకొనవలసిందని రతన్‌జీకి దాసగణు మహరాజ్ ఉపదేశించాడు.

ఒక మంచిరోజునే బయలుదేరి కుటుంబ సహితంగా రతన్‌జీ షిరిడీకి చేరాడు. అతడి కష్టాలన్నీ గట్టెక్కే శుభముహూర్తం ఆసన్నమైంది. ద్వారకామాయిలో ప్రభువు ప్రముదిత చిత్తంతో ఉల్లాసంగా బాలకృష్ణుడిలా కేరింతలు పలుకుతున్న సమయానికి చేరాడు రతన్‌జీ.

గంపతో మహారుచ్యమైన తాజాపండ్లు ఆయన పాదసన్నిధికి సమర్పించాడు. బాబా పాదాలకు తన నుదురును హత్తించాడు. ఒక పెద్ద బుట్ట తెరిచి అతి చక్కని పూలమాల ఆయన కంఠాన గీలించాడు. అమిత భక్తి ప్రపత్తులతో వినయవిధేయతలతో ఆయన పాదాల దగ్గర చతికిలబడి ఆయనకు అనుకంప కలిగేటట్లు దీనంగా వేడుకున్నాడు.

"కష్టదశలో ఉన్నవాళ్ళు ఎవరు నీచెంత చేరినా వాళ్ళను వెంటనే కాపాడుతావు. స్మరణమాత్రం చేతనే వాళ్ళ ఆపదలు బాపుతావు. దరిద్రుడి పాలిటి సమక్షంలో పెన్నిధివి నీవు. నాకు ఆశాభంగం అనే మాటలేకుండా చెయ్యి'' అని కాతర స్వరంతో విన్నపాలు వినిపించాడు.

"అచ్చా ! బేటా ! మంచిది. నీకు శుభం కలుగుతుంది. నీవు ఐదు



రూపాయల దక్షిణ సమర్పించాలని తత్తరపడుతున్నావు. మేలు మేలు. అయితే ఇందులో రూ.3-14-0 నాకిది వరకే ముట్టిందయ్యా! కాబట్టి ఒక రూపాయి రెండణాలు ఇవ్వు. చాలది''

(వెనుకటి కాలంలో ద్రవ్యమానం - రూపాయికి పదహారణాలు నాలుగు పావలాలు. ఎనిమిది బేడలు)

ఈ మాటల అర్థమేమిటో రతన్‌జీ బోధపడలేదు. అతడి ఉబ్బి తబ్బిబ్బయినాడు. ఏం చేయాలో, ఏం చెప్పాలో తోచలేదతడికి. బాబా పాదాలకు మొక్కి ఆ మిగతా పైకం ఆయనకు సమర్పించాడు. తనకు పుత్రసంతానం అనుగ్రహించవలసిందిగా మరీ మరీ ప్రార్థించాడు. బాబా మనస్సు కరిగిపోయింది. "ఎందుకు అంగలారుస్తావురా తండ్రీ ! నీకు కీడు రోజులు ముగిసిపోయినాయి. అల్లా అనుగ్రహించాడు. నీ మనసులోని కోరికను తప్పక నెరువేరుస్తాడు'' అని మందస్మిత సుందరవదనంతో అభయమిచ్చారు.

బాబా శెలవు నర్థించి రతన్‌జీ నాందేడ్‌కు తిరిగి వచ్చాడు. దాసగణు మహరాజు అప్పుడు నాందేడ్‌లో ఉన్నాడు. దాసగణు మహరాజ్‌ను దర్శించి షిరిడీలో జరిగిన సంగతినంతా పూసగుచ్చినట్లు చెప్పాడు. 'అంతా బాగానే ఉంది. కాని మహరాజ్ నాకొక్కటే అర్థం కావటం లేదు. నేను ఇదివరకు ఎప్పుడూ షిరిడీ దర్శించలేదు కదా ! బాబాను దర్శించలేదు కదా ! ఆయన పాదాలను తాకలేదు కదా ! మూడు రూపాయిల పద్నాలుగణాల దక్షిణ నీ విచ్చింది నాకు ముట్టింది అంటారేమిటి. బాబా !' అని ఉత్సుకతతో ప్రశ్నించాడు రతన్‌జీ. దాసగణు మహరాజ్‌కు కూడా ఏమీ పాలుపోలేదు.

ఆయన ఏమీ చెప్పలేకపోయినాడు.

రతన్‌జీ దీన్ని గూర్చే ఎప్పుడూ ఆలోచిస్తూండడం వల్ల, సాయి పాదాలనే ధ్యానిస్తూండడం వల్ల చటుక్కున అతడికి ఒక రోజున ఒక వింత సంగతి స్ఫురించింది. అదేమంటే ఒక రోజున మౌలాసాహెబ్‌గారిని అత్యంత ప్రీతిపూర్వకంగా పరమగౌరవంతో ఆహ్వానించాడు. తాను వర్తకుడు కాబట్టి ఏనాటి లెక్కలు ఆనాడు ఠంచన్‌గా రాసి పెట్టుకుంటాడు. మౌలాసాహెబ్ మహాశయుల సత్కారపుఖర్చు రూ.3-14-0 అయింది. అని మెరుపు మెరిసినట్లు స్ఫురించింది తనకు. మౌలాసాహెబుగారు గొప్ప ఆధ్యాత్మిక దివ్యపురుషుడు. ఆయన గొప్పయోగి, సిద్ధపురుషులు. నాందేడ్‌లో ఆయన గూర్చి తెలియని వారే లేరు.

ఆయన పరిపూర్ణుడు. స్థితప్రజ్ఞుడు. కాబట్టి సాయిబాబా సకల యోగులలో సిద్ధపురుషులలో అద్వైతంగా వెలుగొందుతున్నారని రతన్‌జీ బోధపడింది. ***ఆయన సర్వవ్యాపకుడు. సర్వాంతర్యామి. సర్వజ్ఞుడు. సర్వశక్తిమంతుడు. భూత భవిష్య ద్వర్తమానాలలో జరిగేది జరిగింది జరుగుతున్నది ఆయనకు తెలుసు. కర్మఫలాన్ని గూడా ఆయన తప్పించగలరు. మార్చగలరు. అదుపు చేయగలరు.***

రతన్‌జీకి పుత్రసంతానం కలిగింది. అతడి చిరకాల మనోరథం ఈడేరింది. అయితే పన్నెండుమంది సంతానం కలిగినా ఆ దంపతులకు నలుగురు మాత్రమే దక్కారు. ప్రభువు కృపాదృష్టి ఎంత ఉన్నా అతడు అనుభవించవలసిన కర్మ కొంతైనా అనుభవించాల్సిందే కదా ! అయితే అఖండ సచ్చిదానంద సద్గురు సాయినాథ మహరాజు మాట జరిగి



తీరుతుంది. హరివినాయకసాఠే అను భక్తుడు శ్రీసాయినాథుణ్ణి ఆశ్రయించి పుత్రసంతానం అనుగ్రహించవలసిందిగా ప్రార్థించాడు. చెప్పకూడని మాటే అయినా ప్రభువు కృపాయత్త చిత్తంతో నీకు మొదటి భార్య వల్ల సంతాన ప్రాప్తిలేదు. ఆమె గతించిన తరువాత రెండో భార్యకు పుత్రుడు కలుగుతాడు అని చెప్పారు. అంతే జరిగింది. అయితే రెండో భార్యకు వరుసగా ముందు ఇద్దరు ఆడపిల్లలే పుట్టారు. హరివినాయకసాఠే కొండంత నిరుత్సాహంతో కుంగిపోయినాడు. కాని శ్రీసాయినాథ మహాప్రభువు ఆశీస్సు రిక్తకావడం ఎట్లా? మూడోసారి అతడికి మగ పిల్లవాడు పుట్టాడు. ఆయన ప్రతివ్యక్తి దగ్గర దక్షిణ తీసుకొనేవారు కాదు. కొందరు ఇవ్వబోయినా వద్దనేవారు. కొందరు ఇవ్వకపోయినా బలవంతం చేసి పుచ్చుకునేవారు. నిర్మలమైన మనస్సుతో ఆయనకు స్వాత్మార్పణం చేసుకోవాలి అంతే. ఆయన విశుద్ధాత్ముడు, విశోధనుడు.




**సాయిభక్తులకు శుభవార్త**

ఇంతవరకు తెలుగులో వెలుగుచూడని సాయి భక్తరసవాహిని ''శ్రీసాయిభజనమాల''ను ధారావాహికముగా గురుపూర్ణిమ నుండి సాయిదర్శన్ జూలై సంచికలో ప్రచురిస్తున్నాము.

సదా సాయిసేవలో - **రా వూ జీ**

# కర్మ సన్న్యాస యోగము

**శ్రీశంబాన నారాయణరావు,** డోర్ నెం.9-2/3, హాస్పటల్ రోడ్,
బొబ్బిలి - 535 558, విజయనగరం



**సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వాన్ న కారయన్ ॥ (13)**

(ఇంద్రియ నిగ్రహం కలిగినవాడు మనస్సుచే కర్మలన్నిటినీ వదిలిపెట్టి, తాను ఏమీ చేయనివాడై, ఏమీ చేయింపనివాడై, తొమ్మిది ద్వారములుగల పట్టణమనబడు శరీరమందు హాయిగా వుంటాడు.)

1. కర్మ సన్న్యాసయోగము (కర్మత్యాగం) కర్మయోగాలలో ఏది శ్రేష్ఠమో, ఏది శ్రేయోదాయకమో కృష్ణుని అర్జునుడు అడుగుతాడు.
2. కర్మ త్యాగమూ (జ్ఞానయోగం), కర్మయోగమూ కూడా మోక్షమును కలుగజేస్తాయి. కాని కర్మయోగమే శ్రేష్ఠమైనది అంటాడు కృష్ణుడు.
3. దేనిని ద్వేషింపనివాడు, దేనిని కోరనివాడు నిత్య సన్న్యాసి (త్యాగీ) అనబడును. కర్మలను సన్న్యాసి విడిచి పెట్టకూడదు. గృహస్థుడు కూడా సన్న్యాసి అనబడును.
4. జ్ఞానయోగము, కర్మయోగము వేఱువేఱని చెప్పకూడదు. ఏ ఒక్కదానిని చక్కగా ఆచరించినా ఒకే రకమైన మోక్షపదమును పొందగలము. ఈ రెండు యోగములు ఒకటే అని గ్రహించువాడే జ్ఞాని.





5. కాని కర్మయోగమందు ఆరితేరిన వానికి జ్ఞానయోగము సిద్ధించును.
6. మనస్సు కుప్పిగెంతులను అరికట్టుటకు కర్మయోగం ఉపయోగపడుతుంది.
7. మనశ్చాంచల్యమును అరికట్టుటకు శ్రీసాయిసచ్చరిత్ర ఏమంటుందంటే.... మనస్సును ధనసంపాదన, దేహపోషణ, గృహసంరక్షణము మొదలగు విషయముల పట్ల సంచరించకుండా నిలకడగా వుంచిన, అప్పుడది శాంతముగాను, చింతా రహితముగాను వుండును.
8. **గీతనుండి...**

   భవనానికి గట్టిపునాది అవసరం. అట్లే జ్ఞానయోగం ప్రాప్తికి నిశ్చలమనస్సు (చిత్తశుద్ధి) అవశ్యకం.
9. చిత్తశుద్ధి కలిగి, మనస్సును, ఇంద్రియములను జయించినవాడును, తన ఆత్మ సమస్త ప్రాణుల ఆత్మ ఒకటే అని తెలుసుకున్నవాడు కర్మలు చేసిన వాటి దోషమంటదు.
10. **శ్రీసాయి సచ్చరిత్ర నుండి...**

    దహను గ్రామానికి చెందిన హరిభావ్‌కార్ణిక్ 1917వ సంవత్సరం గురుపౌర్ణమి రోజున శిరిడీలో బాబాను దర్శించి, పూజించి వస్త్రములను దక్షిణ సమర్పించెను. శిరిడీ విడిచి వెళ్ళుటకు బాబా అనుమతి పొంది, మెట్లు దిగుచుండగా ఒక రూపాయి బాబాకు దక్షిణ ఇవ్వాలనుకుంటాడు

కార్ణిక్. బాబా సెలవు పొందిన తరువాత తిరిగి వెనుకకు వెళ్లరాదని విని యింటికి బయలుదేరుతాడు. మార్గమధ్యంలో నాసిక్‌లో 'కాలరాముని' మందిరంలో ప్రవేశించి, దర్శనం చేసుకొని తిరిగి వచ్చుచుండగా, 'నరసింగమహరాజ్' అను యోగి వచ్చి హరిభావ్ కార్ణిక్ చేయి పట్టుకొని 'నా రూపాయి నా కిమ్ము' అని అడుగుతాడు. తాను యివ్వదలచిన రూపాయిని యోగి రూపంలో బాబా అడిగెనని తలచి, రూపాయిని యోగికి యిస్తాడు. దీనినిబట్టి యోగులంతా ఒకటే అని, ఏకాత్మతాభావమును గీత చెప్పినట్లే సాయిసచ్చరిత్రలో ఆచరింపబడినది. మరియు చిత్తశుద్ధితో రెండవరూపాయిని నరసింగమహరాజ్‌కి యిచ్చుటవలన ఆ రూపాయి బాబాకు యిచ్చినట్లే అవుతుంది.

**11. గీతనుండి...**

ఆత్మతత్త్వం తెలిసిన కర్మయోగి తానేమీ చేయడం లేదని తలుస్తాడు. అంటే తినుట, వినుట, మాట్లాడుట, ఊపిరితీయుట, నడచుట, తాకుట మొదలగునవి ఆయా ఇంద్రియాలు వాటివాటి పని చేస్తున్నట్లు కర్మయోగి భావిస్తాడు.

12. తాను చేయు కర్మలన్నింటిని భగవంతునికి అర్పించుటవలన నీరు తామరాకుని అంటనట్లు వానిని పాపాలు అంటవు.

13. యోగులు (కర్మయోగులు) చిత్తశుద్ధి కొఱకై ఫలాసక్తిని విడనాడి అభిమానం లేని వట్టి యింద్రియములచేత కర్మలను చేస్తూంటారు.

14. దేహంతో కర్మలను, వాటి ఫలితాన్ని వదులుకుంటే మనస్సుతో చేయు కర్మలను వదులుటయే గొప్ప.



**15. శ్రీసాయిసచ్చరిత్రనుండి...**

బాబాకు ఇంద్రియ విషయంలో ఏ మాత్రం అభిరుచి యుండెడిది కాదు. వారు భోజనం చేసెడివారు. కాని రుచి అంటే తెలియదు. వారు ప్రపంచమును చూచుచుండిరి. కాని దాని యందు ఆసక్తి లేదు. కామమన్నచో వారు హనుమంతునివలె అస్ఖలిత బ్రహ్మచారులు. వారికి మమకారము, కోరికలు, కోపము మొదలగు భావవికారములు లేకపోవుట వలన ముక్తులు, పరిపూర్ణులు.

16. బాబా పనులను చక్కపెట్టి సేవచేయువారిలో నానావళి ఒకడు. అతడు ఒకరోజు బాబాను గద్దె దిగమని, ఆ గద్దెపై కొంతసేపు కూర్చుండి లేచి తిరిగి బాబాను కూర్చోమనెను. బాబా గద్దెపై కూర్చోగానే సాష్టాంగ నమస్కారం చేసెను. ఈ సంఘటనకు బాబా ఏ మాత్రం చలించలేదు. దీనిని బట్టి బాబాకు దేనిపైన మమకారం లేదని ఆచరణ ద్వారా తెలుసుకోగలిగాము.

**17. గీతనుండి....**

సూర్యుని కప్పియున్న మేఘం ప్రచండ వాయువుచే తొలగించ బడినంతనే సూర్యుడు ప్రకాశించును. అట్లే ఆత్మను కప్పియున్న అజ్ఞానమనే మేఘం జ్ఞానవాయువుచే తొలగింప బడినంతనే ఆత్మ నిజస్వరూపమును తెలుసుకుంటాము.

18. పరమాత్మయందే బుద్ధి, మనస్సు నిష్ఠ కలిగినవాడు, శాశ్వత మోక్షమును పొందుతారు.

19. విద్య వినయం గల బ్రాహ్మణునియందు, ఆవుయందు, ఏనుగుయందు, కుక్కయందు, చండాలుని యందు సమభావం గలవాడే పండితుడు,

జ్ఞాని అని గీత చెప్తుంది.

**20. శ్రీ సాయి సచ్చరిత్రనుండి...**

బాబా భిక్షాటనం చేసేవారు, భిక్షలో దొరికిన పదార్థము లన్నింటిని ఒక మట్టి పాత్రలో వేసెడివారు. దానిని కుక్కలు, పిల్లులు, కాకులు మొదలగు జీవులు స్వేచ్ఛగా తినేవి. మసీదు తుడిచి శుభ్రం చేయు స్త్రీకి 10 రొట్టె ముక్కలు యిచ్చెడివారు. మిగిలిన పదార్థమునే బాబా తినెడివారు. ఈ విధంగా సమస్త జీవులపట్ల సమభావం వుండాలని చెప్పుటయేగాక, ఆచరించి ఆదర్శులయ్యారు బాబా. కావున బాబాయే నిజమైన జ్ఞాని.

**21. గీతనుండి...**

ఇంద్రియాలకు లోబడి అనుభవించే సుఖాలు దుఃఖహేతువులు. కావున విజ్ఞుడు వాటిపై ఆసక్తి చూపడు.

22. శరీరమును విడుచుటకు పూర్వమే ( ఈ జన్మలో) కామక్రోధములను అరికట్టినవాడే యోగి; సుఖవంతుడు.

23. ఆత్మలోనే సుఖించుచు, ఆత్మయందే క్రీడించుచు, ఆత్మయందే ప్రకాశించు యోగి బ్రహ్మస్వరూపుడై బ్రహ్మానందం పొందును.

24. బాహ్య విషయాలపై ఆశలేకుండ, చూపును కనుబొమల మధ్య నిలిపి, ముక్కులో సంచరించు ప్రాణాపానవాయువులను సమానంగా జేసి, ఇంద్రియాలను, మనస్సును, బుద్ధిని నిగ్రహించి, ఆశ, క్రోధం, భయం విడిచి పెట్టిన ముని ఎల్లప్పుడును ముక్తుడై ఉంటాడు.

25. మోక్షప్రాప్తికి కామక్రోధాది అరిషడ్వర్గమును జయించుటయే చక్కని మార్గమని గీత చెప్పగా, మోక్షప్రాప్తికి శత్రువులైన కామక్రోధ లోభాదులను భక్తులనుండి దక్షిణరూపంలో తీసుకొని వారికి మోక్షమును కలుగజేస్తారు



బాబా. ఒకసారి తర్‌ఖడ్ భార్యను 6 రూపాయలను దక్షిణ యిమ్మని అడుగుతారు బాబా. తన వద్ద డబ్బు లేనందున యివ్వలేక చిన్నబోతుంది. బాబా అడిగినది డబ్బు కాదనియూ, మోక్షానికి అడ్డుగా నున్న ఆరుగురు శత్రువులనియూ (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సర) ప్రక్కనే వున్న ఆమె భర్త చెప్పగా, దానికి బాబా సమ్మతించెను. అంటే గీతలో చెప్పబడిన దానిని బాబా భక్తుల పరమప్రాప్తికి తోడ్పడతారు.


26. యజ్ఞములకును, తపస్సులకును భోక్తగాను, సమస్త లోకములకును అధిపతిగాను, సమస్త ప్రాణులకును మిత్రుడిగాను. నన్ను తెలుసుకున్నవాడు పరమశాంతి పొందుతాడని శ్రీకృష్ణుడు చెప్పెను.

27. అట్లే **'ఎవరైతే సర్వస్య శరణాగతి చేసి, నా నామమును ఎల్లప్పుడూ జపించుచూ, నా కర్పించనిదే ఏమియూ తినరో అట్టివారికి నేను ఋణస్థుడను. వారికి మోక్షము నిచ్చి వారి ఋణం తీర్చుకొనెదను'** అంటారు బాబా.

అందుకే 'మనస్సును ధనసంపాదన, దేహపోషణ, గృహ సంరక్షణ మొదలగు విషయముల ఎడల సంచరించకుండా నిలుపవలెను' అంటారు బాబా.

ధనసంపాదన చేసిన పాపాలు మరణానంతరం మన వెంట వెంబడిస్తాయి. కాని పాపాలు చేయుటకు కారణమైన ధనం, మనవెంట రాదు సుమా! మనము సంపాదించిన సంపదలను మరణానంతరం మనతో తీసుకుని పోగల్గితే భూమి ఈ విధంగా మిగిలి ఉండేది కాదు.

సద్గురు శ్రీసాయి పాదుకార్పిత మస్తు
శుభం భూయాత్



On 20th April, 2008 Sri Sai Baba appeared in form of aarathi in the hand of Shastry Poojari while performing Pranaprathista in the presence of His Holiness Sri Sri Sri Vidyanarayana Theertha Swaminaha



# షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవములో ఒక అపూర్వ అద్భుత సన్నివేశము

సికింద్రాబాద్‌లోని మార్కెట్ స్ట్రీట్ కోనేరు సాయిబాబా మందిరములో సాయిభక్త కీ॥శే॥ శ్రీ జి.వి.ఆర్.నాయుడుగారిచే రెండున్నర శతాబ్దాల క్రితం ప్రతిష్ఠించబడి వేలమంది భక్తులతో పూజలు అందుకుంటున్న శ్రీషిరిడిసాయిబాబా గురుస్థానములో పంచలోహవిగ్రహము మరియు స్వర్ణయంత్రము తేది:17-04-2008 నుండి 20-04।2008 వరకు ఘనంగా నిర్వహంచబడిన బ్రహ్మోత్సవ వేడుకలో భాగంగా ప్రతిష్ఠించబడినది.

ఈ మందరింలో పై విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలు శ్రీశ్రీవిద్యానారాయణతీర్థస్వామి నహః (బెంగుళూరులోని ద్వారక బద్రికాశ్రమం పీఠాధిపతి)గారి చేతులమీదుగా జరిగినది.

ఈ పునఃప్రతిష్ఠకు కావలసిన పంచలోహ విగ్రహాన్ని బహూకరించిన దాతలు శ్రీ యస్.వి.పాండురంగారావుగారు, శ్రీమతి & శ్రీ గోపీదాస్, మాష్టర్ కృష్ణ అభిషేక్ స్వర్ణయంత్రాన్ని బహూకరించినవారు శ్రీమతి & శ్రీ సునిల్ సిద్ధం శెట్టి, శ్రీమతి & శ్రీ దామోదర్ మరియు శ్రీమతి & శ్రీ ఆర్.గోపీదాస్ కుటుంబ సభ్యులు.

ఈ సందర్భముగా 17-04-2008 ఉదయం 5 గం॥లకు నుండి 20-04-2008 రాత్రి 7-00 గంటల వరకు అనేక కార్యక్రమాలు (హోరతులు, అభిషేకాలు, అర్చనలు, అన్నదానము, ధ్వజరోహణము మరియు సీతారామ

కళ్యాణము మొ॥వి) నిర్వహించబడినవి.

పై దివ్య కార్యక్రమాల ముగింపురోజున ఏర్పాటు చేయబడిన పూర్ణాహుతి సందర్భములో ఆలయపూజారి శ్రీ వి.యస్.శాస్త్రిగారు కొబ్బరికాయపై హారతి కర్పూరాన్ని గురుస్థాన్ బాబాకు ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమ సమయమునందు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, సచ్చిదానంద స్వరూపుడు, సమర్థ సద్గురుడు అయిన శ్రీ సాయి తాను సశరీరులుగా దర్శనమిచ్చారు. ఈ సమయంలో తీసిన ఫోటోలో సాక్షాత్తు సాయిబాబావారి మూర్తి అక్కడున్న వందల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ ఫోటో మందిరములో నేటికి భద్రపరచబడింది.

ఈ సన్నివేశము మందిరము కమిటీవారు జరిపిన విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి బాబావారి పూర్ణ ఆశీస్సులు ఉన్నట్లు ఋజువైనది. అందరు ఆనందోత్సవాలతో సంతృప్తి చెందారు.

## శాంతి మంత్రం

ఓం ఓం సాయిరాం ఓం షిరిడీ సాయిరాం

| | |
|---|---|
| శాంతి మంత్రం సాయిరాం శక్తి పీఠం సాయిరాం। | ।ఓం॥ |
| బ్రహ్మతేజం సాయిరాం సృష్టి మూలం సాయిరాం | (2) |
| వేదనాథం సాయిరాం అద్భుత రూపం సాయిరాం। | ।ఓం॥ |
| వేదనాథం సాయిరాం లోక దీపం సాయిరాం | (2) |
| దీనబంధు సాయిరాం ప్రేమ సింధూ సాయిరాం। | ।ఓం॥ |
| ప్రశాంత నిలయం సాయిరాం ఆనంద విజయం సాయిరాం | ॥ఓం॥ |



# శిలధిపుర - నివాస సాయినాథ

కంచిరాజు సాయిరాం, S R K Puram. Hyderabad



ఆ:వె: తాను తప్పుచేసి, తప్పించు కొనుటకున్
నిజము దాచ బూను జనుల రీతి,
పిల్లి కనులు మూసి పాల్ద్రావినట్లుంది
శిలధిపుర నివాస సాయినాథ !

ఆ:వె: విలువలేని మణియు, విషములేని ఫణియు,
అట్లు యనుట కయిన అర్థమగున ?
నీకు ప్రియముగాని నేను నేనగుదునా ?
శిలధిపుర నివాస సాయినాథ !

ఆ:వె: కలిమిలేము లెపుడు కడు సహజము గదా !
వాటి గూర్చి మాకు వలదు చింత
మీదు భక్తి కన్న మిన్న యౌ ధనమేది?
శిలధిపుర నివాస సాయినాథ !

ఆ:వె: చివరి ఘడియ వచ్చి చంపుచున్నప్పుడు,
అపుడు నిన్ను దల్తు ననుట యెల్ల,
గాలిలోన మేడ గట్టినట్లె గదా !
శిలధిపుర నివాస సాయినాథ !

ఆ:వె: ప్రేమ భక్తి గల్గి ప్రార్థించి నంతనే
పరుగు లిడుచువచ్చు పరమపురుష !
ఎద యె నీదు గుడిగ, ఏలుకోరా స్వామి !
శిలధిపుర నివాస ! సాయినాథ !

ఆ:వె: ఆశ్రితులయి జేర యాదరించెదవట
ఆదిదేవ ! శ్రీకృపావతంస !
మరి మములను గూడ మన్నింపవా ! ప్రభో !
శిలదిపుర నివాస ! సాయినాథ !



# దైవం మానవరూపంలో...

**వెంకట్ యస్.హరి,** 6-3-597/ఎ/14, వెంకటరమణాకాలనీ
ఖైరతాబాద్, హైద్రాబాద్ - 500 004.

జూలై 16, 2006. ఆ రోజు సాయిదర్శన్ శ్రీరావూజీగారికి ఫోన్ చేసి, సాయిదర్శన్ దర్శించాలని కోరాను. వారు ఊళ్ళో వుంటే, వేరే ఏ నిర్ణయించిన కార్యక్రమాలు ఏమీ లేనట్లయితే ఆ రోజు సాయంకాలం వారి దర్శనం చేసుకోవాలి. తలచినదే తడవుగా ఫోనులో వారు దొరకడం, వారు సరేననడం నాకు ఎంతో తృప్తి నిచ్చింది. సాయంత్రం గం॥4.30 ని॥లకు వస్తానన్నాను. సాయిదర్శన్‌కు రావడానికి చక్కని సూచనలు యిచ్చారు. దాని ప్రకారం సులువుగా వారి కార్యాలయం నేను, నా భార్య చేరుకున్నాము. బయటనుండి చూచేసరికి అది సాయిబాబా మందిరంగా కనిపించింది. ఎక్కడ చూసినా సమర్థ సద్గురు సాయినాథుని చిత్రపటాలు, మూర్తులు అనేక కోణాల్లో అభయమిస్తూ కన్పిస్తాయి. దానికి తోడు వినసొంపుగా మధురస్వరంతో, ఆహ్లాదకరంగా "ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి" ప్రణవనాదం మృదుమధురంగా చెవుల్లో మ్రోగుతుంటే ఆ అనుభూతి మరువలేనిది, అనిర్వచనీయమైనది. వెంటనే లోపలనుండి మహానుభావులు, జీవితాన్ని సాయిసేవకే అంకితం చేసిన పుణ్యాత్ములు శ్రీరావూజీగారు వచ్చి మమ్మల్ని లోపలకు ఆహ్వానించారు. అక్కడ హాల్లో కొంచెంసేపు కూర్చొని బాబాగారి గురించి మాట్లాడుకున్నాము. తరువాత శ్రీరావూజీగారు సాయిసచ్చరిత్ర



(మరాఠీకి తెలుగు అనువాదము) గ్రంథం తీసుకొని వచ్చి నా చేతిలో పెట్టారు. అది ప్రసాదంగా భావించి చూస్తే, అది నేను ఎప్పటినుంచో చదవాలనుకుంటున్న మహాగ్రంథం. నా మనసులోని కోరికను రావూజీగారి కరకమలముల ద్వారా బాబా నాకు అందివ్వడం అదో వరం. తరువాత మాటల సందర్భములో ఎన్నో చక్కని మంచి విషయాలు మా మధ్య దొర్లాయి. మనసులో అనుకున్న ఎన్నో ప్రశ్నలకు శ్రీరావూజీగారిద్వారా సమాధానాలు వచ్చాయి. సంశయాత్మకంగా ఉన్న కొన్ని విషయాలకు పరిష్కారం దొరికింది. అరుదుగా లభించే బాబా ఫోటోలు, శిరిడీ నుండి తెచ్చియిచ్చిన ఊధీ, బాబా శేషవస్త్రాలు శ్రీరావూజీగారి ద్వారా మాకు లభించడం మా అదృష్టం. సాయిదర్శన్ ప్రాంగణంలో ఎంతోసేపు కూర్చున్నా కాలం తెలియలేదు. శ్రీరావూజీగారికి వేరే ఎన్నో విషయాలు చూసుకొనవలసనవి, అర్థరాత్రి వరకూ చేసినా తరగని పని వత్తిడి వున్నాయని తెలిసినా మా మనసు ఎందుకో అక్కడ యింకా ఎక్కువసేపు గడపాలని కోరుకుంటూనే ఉంది. ఈ విధంగా సాధ్యమైనంత ఎక్కువసేపు అక్కడ సత్సంగం చేశాం. బాబాగారి హారతులకు సంబంధించిన వీడియో సి.డి.లను కూడా మాకు కోరని వరంగా దక్కాయి. ఇంతవరకు క్యాసెట్లు, ఆడియో సి.డి.లలో మాత్రమే విన్నాము. ఇప్పుడు ప్రత్యక్షంగా శిరిడీలోని హారతులు కంప్యూటర్‌లోను, సి.డి. ప్లేయరుపై టీవీలోనో చూసుకుంటూ, శిరిడీలో ఆ స్వామి ఎదురుగా వున్నట్లుగా భావించుకొని తన్మయత్వం పొందగలగడం పూర్వజన్మ సుకృతం.

ఎంతో ఓపికతో మేము అడిగిన అన్ని ప్రశ్నలకూ ఒక గురువుగా, జ్ఞానిగా, మార్గనిర్దేశకుడిగా మాకు చక్కని సమాధానాలు యిచ్చి మమ్మల్ని ఆనందింపజేసారు. శ్రీరావూజీ ఏ విధమైన విసుగూ, విరామం లేకుండా మమ్మల్ని తమ కుటుంబ సభ్యులుగా భావించి మా సందేహాలను నివృత్తి చేసారు. అలాగే నా భార్య ఆరోగ్యం కొరకు చక్కని సూచనలు యిచ్చి, హీలింగ్ కూడా చేస్తున్నారు. ప్రతివ్యక్తీ ఎంతో బిజీగా కన్పిస్తూ, నటిస్తూ, వ్యాపారాత్మకమైన ఈ రోజుల్లో అంత సమయాన్ని కేటాయించి ఏమీ ఆపేక్షించకుండా యితరులకు తన ఎంతో విలువైన సమయాన్ని కేటాయించి, అనేక సూచనలు ఇచ్చి భగవంతుని వైపు నడిపించడం సామాన్యులకు సాధ్యమేనా? కోటికి ఒక్కరైనా వుంటారా అటువంటి మహనీయులు.

ఎన్నో పుస్తకాలు, ఫోటోలు, ఊధీప్రసాదంగా శ్రీశిరిడీ సాయినాథుడు శ్రీరావూజీగారిరూపంలో మాకందించారు. వారి ఆశీస్సులు తీసుకొని దమ్మాయిగూడలోని సాయిచంద్రకాలనీ నుండి సాయి దర్శన్‌నుండి సెలవు తీసుకుని యిల్లు చేరాము. వారి పునర్దర్శనానికి మనసు ఉవిళ్ళూరుతుంది. ఆయనలా కాకపోయినా ఎంతో కొంత సమయాన్ని సాయిసేవకు వినియోగించేలా చేయమని ఆ సాయినాథునికి మనసారా విన్నవించుకుంటూ, అర్పించుకుంటూ...

> "నా లీలలను శ్రద్ధా, భక్తితో ఎవరు వినెదరో వారికి ప్రపంచమందు మమత క్షేణించును. బలమైన భక్తి కెరటములు లేచును. ఎవరైతే నా లీలలలో మునిగెదరో వారికి జ్ఞానరత్నములు లభించును. సదా నన్ను జ్ఞప్తియుంచు కొన్నవారి సకల రోగములు నివారించి వారిని మరణము నుండి బయటకు లాగెదను"
> – సాయిబాబా



# బాబా భిక్షచేసిన 5 అదృష్టవంతుల గృహములు

## నందరామ్ మార్వాడీ :

నందరామ్ ధనిక కుటుంబమునకు చెందిన భూస్వామి. ఇతడు బీదసాదలకు సహాయము చేయుటకు ఎప్పుడునూ ముందుండెడివాడు. ఇతని గృహము ద్వారకామాయికి అతి సమీపముగా ఉన్ననూ ప్రతినిత్యము బాబా చివరగా భిక్షను ఈ గృహమునుండి స్వీకరించెడివాడు. ఈ గృహము ముందు నుంచుని "ఓ బోపడిబాయి భిక్షాదే!" (ఓ నత్తమ్మా ! భిక్ష నివ్వు) అని అనెడివారు. నందరామ్ అనేక పర్యాయములు బాబాకు ధనమును చేబదులుగా యిచ్చెడివాడు. 1911వ సం॥లో శిరిడీ గ్రామమునందు ప్లేగు వ్యాధి వ్యాపించగా నందరామ్‌కు కళ్ళు ఎర్రబడి ప్లేగు వ్యాధి సోకగా బాబా అతనితో "ఏ మందులు వాడవద్దు. నిన్ను నేను రక్షించెదను" అని అభయమిచ్చి ఊదిప్రసాదముగా అతనిని ఆరోగ్యవంతునిగా చేసెను. వీరి వంశమున మగ శిశువులు బాల్యమునందే మరణించుచుండుటచే నందరామ్ నాయనమ్మగు రాధాబాయి బాబాను శరణువేడగా బాబా ఆమెకు 3 మామిడి పండ్లు నివ్వగా నందారామ్‌కు ముగ్గురు పుత్రులు జన్మించి చిరకాలము జీవించిరి.

## సఖారాం పాటిల్ షెల్కే :

ఈ గృహము చావిడికి కొంచెము ముందు కలదు. సఖారాం ధనికుడు, భూస్వామి. బాబా యందు భక్తి శ్రద్ధలు కలవాడు. బాబా షెల్కే గృహమునకు, గోండ్కర్ గృహమునకు మధ్య రహదారి నందు నిలబడి

"సఖారాం, రోటీ దే!" అని పిలిచెడివారు.

**వామనరావు గోండ్కర్ :**

సఖారామ్ షేల్కే గృహమునకు కుడివైపునే ఈ గృహము కలదు. వీరిది భూస్వాముల కుటుంబము. లేండీబాగ్ చుట్టు ప్రక్కల గల స్థలమును వారే సంస్థానమునకు ఇచ్చినట్లు తెల్పిరి. వామనరావు 15-03-1964న సమాధి చెందెను.

**బయ్యాజీ అప్పాజీ కోతే పాటిల్ :**

బయ్యాజీ బీర్గాం అను గ్రామమునకు పటేల్. ఇతను కూడా పెద్ద భూస్వామి. ఇతను తన 11వ యేట నుంచే బాబాను సేవించెను. బాబా ఇతని తండ్రి మరణమును గురించి ముందుగానే హెచ్చరించెను. బాబా చెప్పినట్లుగానే అతను స్వర్గస్తుడయ్యెను. బాబా ప్రతి నిత్యము ఇతనికి నాలుగు రూపాయల నిచ్చి వీటిని తిని ఎరగవద్దు" అని చెప్పగా ఆ ధనముతో అతను 84 ఎకరముల భూమిని కొనెను. ఆ భూమియందు ఏ పంట పండించవలెనో కూడా బాబాయే చెప్పెడివారు. బాబా మహాసమాధి చెందు సమయమున "నేను పోవుచున్నాను, నన్ను వాడకు తీసుకొనిపొందు. బ్రాహ్మణులు నా చెంతనే నివసింతురు" అని చెప్పి బయ్యాజీ వైపు కొరిగి శరీరత్యాగము చేసెను.

**బాయిజాబాయి :**

ఈ గృహము అప్పాజీకోతే పాటిల్ గృహమునకు సమీపమునందు గలదు. వీరిది భూస్వాముల వంశము. బాబా షిరిడీ వచ్చిన ప్రథమములో గ్రామస్తులందరూ బాబాను పిచ్చి ఫకీరుగా తలచిననూ బాయిజాబాయి మాత్రము బాబాను భగవంతునిగా గుర్తించి, బాబా అడవిలో నున్నను



మైళ్ళకొలది నడిచి బాబాకు భోజనము సమర్పించి, అటు పిమ్మట మాత్రమే తాను భుజించుచుండేది. తాను సమాధి చెందువరకు ఈ నియమమును పాటించెను.


ఈమె కుమారుడు తాత్యా బాబాకు అంకిత భక్తుడు. బాబాను మామ అని సంభోదించేవాడు. తాత్యా, మహల్సాపతి, బాబా ద్వారకామాయిలో నిద్రించెడివారు.

## చందాదారులకు మనవి

శ్రీసాయిదర్శన్‌ను ఏప్రియల్ 2008 నుండి ఎక్కువ పేజీలు, టైటిల్ ఆర్టుపేపరుపై ముద్రించి సాయిబంధువులకు అందిస్తున్నాము. అందువల్ల అదనంగా ఖర్చు భరించవలసి వస్తుంది. అందుకొరకు పత్రిక చందా పెంచకుండా మీకు అందుబాటులోనే 'శ్రీసాయిదర్శన్' మీ ఇంటికి పంపుట జరుచున్నది. ప్రతి చందాదారులు శ్రీసాయిదర్శన్‌కు ముగ్గురు సభ్యులను చేర్పించి, ఉచిత కానుక పొందగోరుచున్నాము. బంధుమిత్రులను సభ్యులుగా చేర్చుటగాని, లేదా బంధువుల పేర మీరు చందా చెల్లించిన వారికి మీ కానుకగా పంపుచున్నట్లు ఉత్తరం ద్వారా వారికి తెలియపరచగలం.

శ్రీసాయి ప్రబోధ ప్రచారమునకు మీ సహాయ సహకారములు అందించి శ్రీసాయినాథుని కృపాకటాక్షములకు పాత్రులు కండి.

– రావూజీ, ఎడిటర్



# సాయినాథ ఉవాచ

సేకరణ - వ్యాఖ్యాత సాయిదాసానుదాసు
**సురేంద్రబాబు,** కోవూరు, నెల్లూరుజిల్లా

***(శ్రీసాయివాక్కులు బ్రహ్మవాక్కులు! శ్రీసాయి షిరిడీలో సశరీరులుగా మెలిగిన 60 సం॥రాలలో వారి వాచ అసంఖ్యాకమైన వాక్కులు వెలువడ్డాయి. వాటిలో ఆణిముత్యాల్లాంటి కొన్నింటిని ఏర్చి, సందర్భోచిత వ్యాఖ్యాన సహితంగా దిగువ ఇవ్వడం జరిగింది, అవధరించండి)      (గత సంచిక తరువాయి భాగము)***

***(264) "నేనొకప్పుడు నాశరీరంలోని క్రింది భాగాన్ని, చిలుక శరీరంలోని క్రింది భాగంగా మారాలని తలచాను.వెంటనే అలా మారిపోయాను."***

బాబా ఈ క్రింది కథను భక్తులతో చెప్పేవారు.తామొకప్పుడు తమ శరీరంలోని క్రింది భాగాన్ని, చిలుక శరీరంలోని క్రింది భాగంగా మారాలని సంకల్పించారట. వెంటనే అలా మారిపోయారట, కానీ అలా మారడం వల్ల కొన్ని లక్షలరూపాయలు నష్టపోయారట.

ఇది కూడ ఒక యోగసాధకుని కథ. తమ పరంగా చెప్పుకున్నారు.చిలుక కామానికి ప్రతీక. చిలుక క్రింది భాగంగా మారడమంటే విషయ సుఖాలలో మునిగిపోవడం. కొన్ని లక్షల రూపాయలు నష్టపోవడమంటే ఎంతో యోగశక్తిని నష్టపోవడం. కాబట్టి యోగసాధకులెవ్వరూ విషయసుఖాలకు లోనుకాకూడదనే హెచ్చరిక దీనిలో వుంది.



***(265) "కళ్యాణ రామ రారమ్ము, గోనెలతో ఊదీని తే తెమ్ము!"***

ఊదీ యొక్క మహత్మ్యాన్ని తెలుపు ఈ పాట అప్పుడప్పుడు బాబా ద్వారకామాయిలో కూచుని పాడుతుండేవారు. బాబా ఇంకా తమ దగ్గర బస్తాలకొలదీ ధనముందని, దానిని అడిగినవారికి అడిగినంత యివ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కానీ అడిగి తీసుకెళ్లేవారే కరువయ్యారని చెప్పేవారు. ఇక్కడ ధనమంటే యోగ ధనం.

***(266) "అతిథి అంటే నీ వనుకున్నట్లు 5 1/2 అడుగుల బ్రాహ్మణ మానవ శరీరము కాదు.ఆ వేళకు ఆకలిగొని వచ్చిన ఏ ప్రాణియైనా, జంతువైనా, పక్షి అయినా, పురుగైనా అతిథే !"***




నానా సాహెబ్ చందోర్కార్ శృతులను అక్షరాలా పాటించేవాడు. ప్రతి దినం భోజనం తయారుచేసి, వాసుదేవుని కర్పించిన తర్వాత అతిథి కోసం వేచి ఉండేవాడు, ఒక్కొక్కసారి అతిథులు దొరకడం కష్టమయ్యేది. అది క్యాంపులలో ఉన్నప్పుడు దుర్లభమయ్యేది. ఒకసారి బాబాను దర్శించడానికి శిరిడీకి వెళుతూ ఇదే విషయం ఆలోచిస్తూ, వేదాలను తప్పుపడుతున్నాడు. బాబా ఇతని మనస్సు పసిగట్టి "నానా,వేదాలెప్పుడూ తప్పుకావు, నీవు వాటిని అర్థంచేసికొనే తీరేతప్పు. అతిథి అంటే 5 1/2 అడుగుల బ్రాహ్మణ మానవుడు మాత్రమేనని నీవనుకుంటున్నావు. ఆ వేళకు ఆకలిగొని వచ్చిన ఏ ప్రాణి అయినా అతిథే. అందువల్ల నీవు అతిథి కోసం వేచి ఉండనక్కరలేదు. పిలవనక్కరలేదు. సమృద్ధిగా ఆహారం

తీసికొనిపోయి ఇంటి బయట ఒక మూల ఉంచు. ఆకలిగొన్న ఏ ప్రాణి ఆయినా దానిని తింటుంది. వాటి ఆకలి తీరితే భగవంతుడు సంతృప్తి చెందుతాడు"అన్నారు.

***(267) "ఈ చోటు చంపడానికి కాదు. తరింపుపొందటానికి!***

***(ఏ జగామార్‌నేకేలి యేనహాం, తార్‌నేకేలి యేహై !)***



ఉపాసనీ బాబా ఛాందస ఆచారపరుడు, బాబా చెప్పినా వినకుండ ఎన్నో రోజులపాటు ఉపవాసాలు చేయసాగాడు, తత్ఫలి తంగా బాగా కృశించి, మరణానికి దగ్గరయ్యాడు. అప్పుడు శ్యామా బాబా దగ్గరికెళ్లి, ఉపాసనీ చనిపోయేటట్లున్నాడని, అతనిని కాపాడమని ప్రార్థించాడు. అప్పుడు బాబా," ఈచోటు ఉన్నది చంపడానికి కాదు. తరింపుపొందడానికి మాత్రమే. ఉపాసనీ రోగానికి మందు భోజనం. అతనికి భోజనం పెట్టండి ! అని ఆదేశించారు. భక్తులలాగే చేశారు. ఉపాసనీ కోలుకున్నాడు.

***(268) "గురువును తెలుసుకో! లేకుంటే ఎందుకు వచ్చినట్లు ? (ఈలోకానికి) పిడకలు ఏరుకోవడానికా?"***

బాబా గురువు ఆవశ్యకత గూర్చి తరచూచెప్పేవారు. గురువును అన్వేషించి, తెలుసుకోవాలని, వారి ద్వారా మాత్రమే దైవ సాక్షాత్కారం పొందగలమని చెప్పేవారు.మానవజన్మలో మాత్రమే దైవ సాక్షాత్కారం పొందగలమని చెప్పేవారు. ఉత్కృష్టమైన మానవ జన్మ ఎత్తింది గురువును



తెలుసుకోడానికే గానీ,పుట్టుట గిట్టుట కొరకే అన్నట్లు, మన చితికి కావలసిన సమిధలు (పిడకలు) సమకూర్చుకోడానికి (ఏరుకోడానికి) కాదని వారి భావం. మానం జన్మ యొక్క పరమార్థం, గురువును తెలుసుకొని, తద్వారా దైవసాక్షాత్కారం పొందడంలోనే వుందని, వ్యర్థ కార్యకలాపాలతో జీవితం వెళ్ల బుచ్చడంలో లేదని కూడ వారి భావంగా చెప్పుకోవచ్చు.

***(269) "నీ గురువును విడిచి పెట్టివద్దు. ఇతర గురువులు ఎంతటి గొప్పవారైనా, నీ గురువు ఎంత తక్కువ వారైనా సరే, నీ గురువుని అంటి పెట్టుకో !"***

పంత్ అనువాని స్నేహితులు శిరిడీ వెళుతూ, రైలు బోగీలో పంత్‌ను కలిశారు. పంత్‌ను కూడ రమ్మని ఆహ్వానించారు. సాయిబాబా ఒక సిద్ధపురుషుడని, వారిని తప్పక దర్శించాలని కూడా చెప్పారు. పంత్‌కు వేరొక గురువున్నాడు. అందువల్ల అతను మధ్యలో దిగి, గురువున్న చోటుకు వెళ్లి, శిరిడీ వెళ్లడానికి, వారి అనుమతి తీసికొని, వేరొక స్టేషనులో స్నేహితులను కలిశాడు. అందరూ శిరిడీ చేరారు. ద్వారకామాయిలో అడుగిడుతూనే, పంత్‌కు తీవ్రస్థాయిలో మూర్ఛవచ్చి గిలగిల కొట్టుకోసాగాడు. రెండు మూడు కడవలు నీళ్లు తెచ్చి అతనిపై పోశారు. కాసేపటికి అతను తేరుకున్నాడు. పంత్ వేరొక గురువు శిష్యుడని, తన గురువు యొక్క అనుమతి తీసుక వచ్చినా, గురు ద్రోహం చేస్తున్నా నేమో అనే సందేహం, అతని నింకా పీడిస్తున్నందువల్ల అలా అయ్యిందని బాబా గ్రహించారు. అతని గురువునే అంటి పెట్టుకోమని,

ఇతర గురువులు ఎంతగొప్పవారైనా, తన గురువు ఎంత తక్కువ వాడైనా, వారినే కొలుచుకుంటూ ఉండమని సలహా యిచ్చి పంపారు.

**270. "ఏకాదశి ఈ పిచ్చివాళ్లకి కానీ, నీకు కాదు కదా ! వెళ్ళి భోంచేసిరా !"**



శాంతారాం బల్వంత్ నాచ్నే, వైద్య, దాతే అనే స్నేహితులతో కలిసి షిరిడీ వచ్చాడు. వీళ్లు శిరిడీ వెళ్ళిన మరురోజు ఏకాదశి వచ్చింది. వైద్య, ధాతేలకు ఏకాదశి రోజున ఉపవాసముండే అలవాటుంది. అందువల్ల వారు ఉపవాస దీక్ష ప్రారంభించారు. నాచ్నేకు ఉపవాసముండే అలవాటు లేదు. అతను ఆకలికి తట్టుకోలేడు. కానీ తనతో వచ్చిన స్నేహితులు యిరువురూ ఉపవాసమున్నప్పుడు, తను మాత్రం భోంచేయడం బాగుండదని తలచి, తనూ ఉపవాసముండటం మొదలుపెట్టాడు. ఆరతి సమయానికి ముగ్గురూ మశీదుకు వచ్చారు. సర్వజ్ఞుడైన సాయిబాబాకు తెలియనిదేముంది? నాచ్నేను చూస్తూనే, "భోంచేశావా?" అనడిగాడు. ఆ రోజు ఏకాదశి అని నాచ్నే చెప్పాడు. బాబా వైద్య, దాతేలను చూపుతూ, "ఏకాదశి ఈ పిచ్చివాళ్ళకి గానీ, నీకు కాదుగా!" వెళ్ళి భోంచేసి రా !" అన్నారు. ఆరతి అయిన తర్వాత భోంచేస్తానని నాచ్నే చెప్పాడు. కానీ బాబా అతను భోంచేసిన తర్వాతే ఆరతి మొదలవుతుందని చెప్పి, అతనిని వాడాకు పంపారు. దీనిని బట్టి ఉపవాసం, తపవాసాలను బాబా ప్రోత్సహించే వారుకాదని తెలుస్తుంది. ఉపవాసమున్నవారిని పిచ్చివాళ్ళుగా జమకట్టిన విషయం తెలిసింది కదా !



## అధ్యాత్మికదర్శన్

- నదీ ప్రవాహములో కొట్టుకొనిపోవుచున్న కట్టెపుల్లలు కొన్ని ఒక్కొక్కసారి కలుసుకుని తిరిగి విడిపోవుచుండును. అట్లే కాల ప్రవాహవేగము వలన మనుజునకు బంధుమిత్రాదులు ఏర్పడుచు కొంతకాలమునకు విడిపోవుదురు. కనుక మనుజుడు బంధ్యాదుల యెడల, ప్రాపంచిక సంపదల యెడల మమత్వమును, అభిమానమును పెంచుకొనరాదు. దేహాత్మభావనను, దృశ్యాత్మభావనను వదలి మానవుడు శాశ్వత పరమాత్మయందు నిలకడను బడిసి జన్మరాహిత్యమును, మోక్షమును సంపాదించవలెను.
- కొన్ని చెక్కపదార్థములు, ఇనుపవస్తువులు కలిసియున్న మిశ్రమము నుండి ఇనుప వస్తువులు వేరుచేయుట కష్టమై యుండవచ్చును. కాని అయస్కాంతము దానియందలి ఇనుపముక్కలను ఆకర్షించి వేరుచేసినచో ఒక్క చెక్కపదార్థములు మాత్రమే శేషించియుండును. అదేరీతిగనే దైవసన్నిధి వలన భక్తుని మనస్సులోని సత్వగుణ, రజోగుణ, తమోగుణములు సంపూర్ణముగా తొలగింపబడినచో ఆత్మ వస్తువు ఒక్కటియే శేషించును. అప్పుడు భక్తుడు పరమానందమును అనుభవించును.
- కమ్మరివాడు కొలిమిలో నిప్పు ఆరిపోకుండ తిత్తులద్వారా గాలిని ఎల్లప్పుడు పంపుతూ జాగ్రత్త పడుచుండును. ఆ విధముగనే మానవుడు తన మనస్సును అజ్ఞానాంధకామునందు మునగనివ్వక బ్రహ్మజ్ఞానముల యొక్క బోధలను గ్రహించి ఆచరించుచు జ్ఞాన ప్రకాశమందు ప్రవేశపెట్టవలెను.

అట్లు చేయుటవలన మనస్సు పరిశుద్ధతను పొందును. అప్పుడు మానవుడు శాశ్వతానందమును అనుభవించును.

□ భ్రమరమనగా తుమ్మెద జాతి పురుగు. అది ఇతర జాతి సామాన్యపురుగును తెచ్చి గూటియందుంచి తన ఝుంకార శబ్దముచే ఆ పురుగును తన జాతి భ్రమరముగ మార్చునట్లు అజ్ఞానిని, జ్ఞానియగు మహాత్ముడు తన వద్దకు చేర్చి, తన యోగమహిమ చేతను, జ్ఞానబోద చేతను, అతనిని తనవలె జ్ఞానిగా మార్చును. □ □

## జ్ఞాపక శక్తి

జ్ఞాపకశక్తిని పెంపొందించే ఈ దిగువ వాక్యములు దృఢచిత్తంతో ధ్యానం చేయండి. ప్రతిరోజు జపించడంవల్ల మీలో అద్భుతమైన అభివృద్ధి కనబడుతుంది.

నాకు దృఢమైన జ్ఞాపక శక్తి ఉంది. ఓం సాయి

నేను అనేక విషయాలను చక్కగా జ్ఞాపకము ఉంచుకోగలను ఓం సాయి

నా జ్ఞాపకశక్తి ఎంతో అభివృద్ధి చెందింది. ఓం సాయి

నాకు అద్భుతమైన ధారణశక్తి ఉంది. ఓం సాయి

సాయి దయవలన రోజు రోజుకి నేను అన్ని విధాల బాగుపడుతున్నాను. ఓం సాయి

ఆరోగ్యవంతుడైన వ్యక్తికి మంచి జ్ఞాపకశక్తి ఉంటుంది.

□ □ □ □ □ □



# ధ్యానం

– రావూజీ

ఆరోగ్యానికి 'ధ్యానం' చాలా మంచిది. ధ్యానమంటే కళ్ళు మూసుకొని కూర్చుండుట కాదు. ధ్యానం అంటే 'తెంపు' లేక నిరంతరంగా కొనసాగే స్థితి. మంత్రజపం నిరంతరం సాగినా, ఏదైనా భావం నిరంతరం కొనసాగినా నిశ్చలస్థితి తెంపు లేక సాధననే ధ్యానం అనబడుతుంది.

ఒకే మంత్రజపంగాని, ఒకే భావంపై గాని, ఒకే రూపంపై గాని, లేక నిశ్చలంగా వుంచడం ద్వారాగాని, మనస్సును క్రమపద్ధతికి అలవాటు చేయాలి. ధ్యానశక్తి అనంతమైనది. పతంజలి మహర్షి తన సూత్రాలలో ధారణ, ధ్యానము, సమాధి అని వివరిస్తూ ఈ ప్రక్రియలు మూడు ఎవరికి కరతలామలకం అవుతాయో వారు సర్వజ్ఞులు, సర్వశక్తిమంతులు. వారే సర్వేశ్వరులు అని వివరించారు.

దీని అర్థం మానవమేధస్సుకు అందని అనేక శక్తులు ఈ మూడు ప్రక్రియలద్వారా మనిషి సాధించుకొనగలడు.

మన ఇష్టదైవం యొక్క నామాన్ని ఎన్నుకొని దానిపై శ్రద్ధ, భక్తులు వుంచి ఆర్తితో జపించాలి. మనస్సును నిశ్చలం చేసి, ఆలోచనలు ఆపుచేసి, నామరూపాలు వదలి కేవలం అంతఃకరణగా వుండిపోవాలి.


ఏ ధ్యానమైనా శ్రద్ధ, భక్తి, ఆర్తీ లేకుండా నిర్లక్ష్యంగా చేస్తే అది నిరుపయోగమవుతుంది. ఎక్కడ ఆర్తితో కూడిన ప్రయత్నం వుంటుందో, నిరంతరాభ్యాసంగా కొనసాగుతుందో అక్కడ మాత్రమే స్వల్ప ఫలితమైనా రుచి చూడగలం.

సూర్యోదయానికి ముందుగా నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకొని ధ్యానం చేయడం ఆరోగ్యానికి మంచిది. దక్షిణ దిక్కువదలి ఏ దిక్కుముఖంగానైనా కూర్చుని ధ్యానం చేయాలి. ఇలా ఒక సంవత్సరం పాటు ధ్యానాన్ని అభ్యసించినవారికి దాని మీద రుచి కలిగి ఫలితాలు కనబడతాయి.

**మనో బానిసత్త్వాన్ని విడనాడి, నామరూప మమకారానికి దూరమై, నేను, నాదియన్న భావననుండి విముక్తుడవు కమ్ము – శ్రీ అరవిందులు**

# శ్రీలలితా సహస్రనామములు(అర్ధసహితము)

(గతసంచిక తరువాయి భాగం)- ***యల్లమిల్లిసరోజినిజోగారావు.*** హైదరాబాద్



**114."ఓం భవారణ్యకుఠారికాయై నమః" :** శ్రీభవాని, భావనాగమ్య ఈ సంసారమనే ఘోరమైన దట్టమైన అరణ్యాన్ని ఛేదించి, మోక్షమార్గము చూపును. గొడ్డలి ఏ విధంగా ముళ్ళ చెట్లను విరక్కొట్టి అడ్డు తొలగించునో అలాగే ఈ భవారణ్యమునకు గొడ్డలి పెట్టువంటిది జగదంబిక.

**115."ఓం భద్రప్రియాయై నమః" :** తన భక్తులను నిరంతరం భద్రంగా కాపాడు లోకజననికి నమస్కారము. భద్ర అనగా మంగళకరమైన అని మరు అర్ధం. పసుపు, కుంకుమ, పూలు, నవరత్నములు, నవధాన్యాలు ఇలాటి మంగళకరమైనవి సర్వమంగళకు ప్రీతిదాయకము. సౌభాగ్యవతులు చేయు నిత్యమంగళవ్రతాలు, మంగళగౌరిగా స్వీకరించి అనుగ్రహించును.

**116."ఓం భద్రమూర్త్యైనమః" :** సకల లోకాలకు భద్రత కలిగించు శ్రీభద్రాత్మిక దివ్యమంగళస్వరూపిణి. సకల జీవుల రక్షణ కల్పించు, సర్వరక్షకారికి నమస్కారం.

**117."ఓం భక్తసౌభాగ్యదాయిన్యై నమః" :** తన భక్తులకు, తమ శక్త్యానుసారం, ఆరాధన చేయువారి, భక్తిని ప్రధానంగా తీసుకుని, సకల సౌభాగ్యసంపదల



నొసగి అనుగ్రహించును. భక్తి ప్రధానం గానీ, ఆడంబరము గాదు అని నిరూపించు జగన్మాతకు నమస్కారము.

**118."ఓం భక్తప్రియాయై నమః":** ముఖ్యభక్తి, గౌణభక్తి అని రెండు విధములైన భక్తి వున్నది. నిస్వార్ధ, నిర్మోహభక్తి ముఖ్య భక్తి. కోరికలతో చేయు భక్త్యారాధన గౌణభక్తి. నిష్కామభక్తియే జగదీశ్వరికి ప్రియము. శరణాగతి మహాప్రీతిదాయకము.

**119."ఓం భక్తి గమ్యాయై నమః" :** తన భక్తులు నిజమైన భక్తితో, ఆర్తితో ఆర్ధించినచో ఆర్తత్రాణపరాయణి వారిని ఆడుకొనును. భక్తునిలో శ్రీపరబ్రహ్మణిని దర్శించి, తరించాలనే తపనగలుగునో, అదియే తపస్సు - వారి భక్తికి గమ్యం చూపును. అనగా జీవన్ముక్తి ప్రసాదించును.

**120."ఓం భక్తి వశ్యాయై నమః" :** నిష్కల్మష భక్తితో జగదీశ్వరిని, శరణువేడినచో కల్పవల్లి వారి అండన వుండును. బ్రహ్మాండనాయకి చల్లగా కాపాడును. నిర్మల భక్తికి వశురాలైన మహాశక్తి స్వరూపిణికి నమస్కారము.

**121."ఓం భయాపహాయై నమః" :** మనల్ని ఎన్నో భయాల నుంచి కాపాడు, భయాపహారిణికి నమస్కారము. మృత్యుభయంతో జీవించువారికి అండగా నిలిచి, మనోధైర్యం, మనోబలం నొసగి, ఆధ్యాత్మిక బోధ చేసి భయవిముక్తులజేయు అభయముద్రాంకితకు నమస్కారం.

**122."ఓం శాంభవ్యై నమః" :** శంభుపత్ని శ్రీశాంభవీదేవి అత్యంత శ్రద్ధా భక్తితో ఆరాధించు తన భక్తులకు జ్ఞానముద్రవంటి 24 ముద్రలతో న్యాసం చేస్తూ మంత్రధ్యానము చేయు పరమ యోగులు, సమాధిస్థితిలో జగన్మాతను దర్శించగలరు. (సశేషం)

# అన్నదానం పరమోత్కృష్టం

– *యం.నాగేంద్ర ప్రసాద్, తిరుపతి*

అన్నం పరబ్రహ్మం. అన్నం వలననే శరీరాలు ఏర్పడుతున్నాయి. అన్నం వలననే ప్రాణాలు నిలబడుతున్నాయి.

బాహ్య ప్రపంచాన్ని ఇంద్రియాల ద్వారా దర్శించగలగుతున్నాం. పంచేంద్రియాలకు గృహం ఈ దేహం. ఆత్మను కప్పివేసే ప్రకృతి పొర అన్నమయకోశం. స్థూల శరీరం అన్నింటిలోకీ స్థూలమైనపొర. మన వ్యక్తిత్వంలో చివరి అంచున ఉన్న స్థూలశరీరమే అన్నమయకోశం.

దీని లోపలే మన అస్థిత్వం. తండ్రి తిన్న ఆహారాన్నుంచి ఏర్పడి, తల్లి తిన్న ఆహారంతో గర్భంలో పెరిగి, గర్భంనుండి బయట పడ్డాక ఆహారం తిని జీవించి ఎదుగుతూ చనిపోయిన తర్వాత నేలలో ఎరువై తిరిగి ఆహారంగా మారుతుంది.

అన్నమే మానవజీవనాధారం : ప్రాణప్రదమైన శక్తినిచ్చే ఆహారాన్ని భగవంతుని ప్రసాదంగా భావించాలి.

అన్నింటా తానైవుండే శక్తి స్వరూపుడైన పరమేశ్వరుడు ఆహారంలో మరింతగా విస్పష్టంగా వ్యక్తమవుతాడు. అందుకే అన్నమంటే స్వయంగా పరబ్రహ్మ స్వరూపమంటారు పెద్దలు.

మనందరికీ దేహాలున్నాయి. ఈ దేహాలను ఏదో విధంగా పోషించాల్సిన బాధ్యత మనకున్నది. ఈ కలియుగంలో గాలి, నీరు మాత్రమే కాదు, ప్రాణపోషణకు అన్నం కూడా కావాలి.

ఆకాశన్నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు,



నీటి నుంచి భూమి, భూమి నుంచి వృక్షం, వృక్షం నుంచి ఆహారం, ఆహారంన్నుంచి జీవశక్తి ఏర్పడుతున్నాయి.

తత్త్వజ్ఞానాన్ని సముపార్జించడానికి, సత్యసిద్ధికోసం పరమోత్కృష్టమైన మానవ ధర్మాల్ని నెరవేర్చుకొనడం కోసం ప్రాణాన్ని కాపాడుకోవాలి. అందుకు ఆహారం తీసుకోవాలి. సంపాదించడానికి ఏదో పని చేయాలి. న్యాయమార్గంలో సంపాదించిన డబ్బుతో తన కుటుంబాన్ని, తనను కాపాడుకోవాలి. తీసుకునే ఆహారస్వభావాన్ని బట్టి దాని ప్రభావము మనపై పడుతుంది.

మన దేహాన్ని ఆవరించి వున్న వైశ్వానరుడు (అగ్ని) మనం తీసుకున్న ఆహారాన్ని పచనం చేస్తాడు.

అలా జఠరాగ్ని ప్రమేయంతో ఉత్పత్తి అయిన శక్తి శరీరంలోని అన్ని భాగాలకు అందుతుంది. జఠరాగ్నిలో అను దినము జరిగే నిత్యయజ్ఞానికి హవిస్సుగా, సమతుల్యమైన మితాహారాన్ని మాత్రమే స్వీకరించి, జీవశక్తి నింపుతున్నాడు వైశ్వానరుడు.

ధర్మసాధనకు శరీరము ముఖ్యసాధనం. పూర్వపుణ్యవిశేషం చేతనే శరీరం లభిస్తుంది. పురుషార్థాన్ని లభింపచేయడమే శరీరధారణ లక్ష్యం.

మనుష్యజన్మలో జ్ఞానము ముఖ్యమైనది. భూమి మీద పుట్టిన వాళ్ళంతా జ్ఞాన సమపార్జన కోసం పాటుపడాలి. ప్రతి మనిషీ శరీరాన్ని కూడా పోషించాలి. సమస్త ధర్మాలకు మొదటి సాధనం ఏదీ అంటే శరీరమే ! కాబట్టి శరీరము వుండాలి అంటే క్షుద్బాధానివృత్తికి అన్నం వుండాలి.

అన్నమున్నంత వరకే ఆయువు.

కృతయుగంలో అస్థిగతప్రాణులు. అంటే ఎముకలు మాత్రమే వున్నా

ఆయుష్షు వుంటుంది. త్రేతాయుగంలో మాంసగతప్రాణులు. అంటే మాంసం వున్నంత వరకు ప్రాణముంటుంది. ద్వాపరయుగంలో రుధిరగత ప్రాణులు. రక్తం మున్నంతవరకే ప్రాణముంటుంది. కలియుగంలో శరీరానికి అన్నమున్నంతవరకే ఆయువు.

ఆకలి ఎంత భయంకరమైనదో తెలిస్తే ఆకలి అనే మహాగ్నిని శాంతపరచగల అన్నం మహత్తు ఏమిటో తెలుసుకోగలం. ప్రతి అన్నం మెతుకులోను వున్న మహాశక్తి ఏమిటో అవగతమవుతుంది. అన్ని జీవులల్లోను సంచరిస్తున్న ప్రాణశక్తికి ఆ మహాచైతన్యాన్ని తెలుసుకొని అనుభవించగల అవకాశం అన్నం ద్వారా లభిస్తుంది. ఆకలి తీరినప్పుడూ తీరనప్పుడూ కూడా దేవుళ్ళు కనబడతారు.

అందుకే దైవ ప్రసాదమైన అన్నాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో, గౌరవభావంతో స్వీకరించాలి. మనం భుజించే ఆహారం శుచిగా, పరిశుద్ధంగా వుండాలి. తినబోయే ఆహారానికి పరిశుద్ధత లభించేందుకు పరబ్రహ్మ స్వరూపమైన ఈశ్వరునికి నైవేద్యం పెట్టాలి. ఆ ఆహారం ఈశ్వరునికి అర్పించినట్లు ఆయన తన అనుగ్రహ కృపలతో మనకు తిరిగి ఇచ్చాడని తృప్తి చెందడం వలన మనకు అమితమైన ఆనందం కల్గుతుంది.

**భోజన విధి :**

ఎంతో విలువైన అన్నాన్ని అన్నివేళలా పూజ్యభావంతోనే చూడాలి. తిరస్కార భావంతో చూడడం లేదా నిందాపూర్వకంగా మాట్లాడడం కూడనివి. అన్నాన్ని చూస్తూనే ముఖంలో ప్రసన్నత కలగాలి. పూజింపబడిన అన్నం బలాన్ని, సామర్థ్యాన్ని ఇస్తుంది. పూజింపబడని ఆహారం ఈ రెండింటిని నాశనము చేస్తుంది.

**ఎటువంటి అన్నం తినరాదు !**

దైవ ప్రసాదమైన అన్నాన్ని ఎంతో శ్రద్ధలతో, భక్తితో, గౌరవంతో



స్వీకరించాలి. మితిమీరి తినడం, వేళలు పాటించకపోవడం, ఆశబోతులా ఎప్పుడంటే అప్పుడు ఎన్నిసార్లంటే అన్నిసార్లు, ఉడికి ఉడక్కుండా, సగం ఉడికినా, సమపాకంలో లేకపోయినా, పాచిపోయిన వాటిని తినడం వల్ల జఠరాగ్ని మందగిస్తుంది.

అలా జరిగితే శరీరము రకరకాల రోగాల మయమవడం ప్రారంభమవుతుంది. తద్వారా అపాన వాయువు విడుదల చేయడం ఆరోగ్యం పాడవుతుంది. బాగా ఆకలిగా యున్నప్పుడే ఆహారాన్ని భుజించాలి. మితిమీరి భుజించడంవల్ల నయం కాని రోగాలు సంప్రాప్తిస్తాయి. నిద్రాహారాలు రెండూ కూడా మానవుడి జీవితాన్ని వంచించే దొంగలు కాబట్టి ఈ రెండింటిని అదుపులో వుంచుకోవాలి.

**అన్నాన్ని వ్యర్థం చేయరాదు :**

అన్న పదార్థాలను అవసరాన్ని మించి వడ్డించుకోవడం, మొహం మొత్తి తినలేక పారవేయడం క్షమించరాని దోషం.

**భూత బలి :**

సృష్టిలోని మిగిలిన ప్రాణుల కోసం సమర్పించే ఆహారాన్ని 'భూతబలి' అంటారు పెద్దలు. మనకోసం కేటాయించుకున్న ఆహారం భాగంలోనుంచి కొంత తగ్గించుకుని, మిగతాప్రాణుల కోసం సమర్పించడమే నిజమైన భూతబలి అవుతుంది. ఇంటికోసం అన్నం వండుకొనేటప్పుడు ఎసట్లో బియ్యం వేసేముందు ఒక గుప్పెడు బియ్యం తీసి దానం కోసం ప్రక్కన పెట్టే అలవాటు మన సంస్కారము. ఇలా చేయడం వల్ల మిగతా అన్నానికి మహత్తు ఏర్పడుతుంది. అన్నరూపంలోని పరబ్రహ్మను గౌరవించినట్లవుతుంది.

**ఉపవాసాలు :**

పరమాత్మయే వైశ్వానరుడై ప్రాణుల శరీరాన్ని ఆవరించి నాలుగు విధాలైన అన్నాన్ని జీర్ణింపజేయుచున్నాడని భగవద్గీత చెప్తుంది.

అన్ని ప్రాణులయందును పరమాత్మ నిండియున్నాడు. కాబట్టి పరమాత్మునిచే ఆవరింపబడ్డ శరీరాన్ని ఉపవాసాదులచేత మితం తప్పి శుష్కింపజేయడం మంచిదికాదు.

**దానం అంటే ఏమిటి?**

తనకున్నదంతా ఇచ్చేస్తే త్యాగమంటారు. తనకున్న దాంట్లో ఇతరులకు కొంత ఇవ్వడాన్ని దానమంటారు. దానికెంతో గొప్పస్థానముంది.

దానం చేయడం వలన దుఃఖితులు దుఃఖాన్ని పోగొట్టుకొని కొంతైనా ఉపశమనం పొందుతారు. దానంవలన శత్రువులు మిత్రులవుతారు.

శక్త్యానుసారం దానాలు చేసినవారికి మంచి లోకాలు ప్రాప్తిస్తాయని, దానానికి అశ్వమేధ యాగఫలం లభిస్తుందని, దేవతల సరసన చోటు లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.

**దానం – యుగధర్మం**

తపస్సు, బ్రహ్మజ్ఞానం, యజ్ఞం, దానం అనేవి నాలుగు యుగధర్మాలు. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపరయుగంలో యజ్ఞం, కలియుగంలో దానం అనేవి ఆ యా యుగధర్మాలని మనుస్మృతి చెబుతుంది.

తగిన ప్రదేశంలో సరియైన సమయంలో పాత్రత ఎరిగి న్యాయంగా ఆర్జించిన దానిని మాత్రమే దానం చేస్తే అది అనంత ఫలప్రదమని బ్రహ్మోత్తర పురాణం చెప్తుంది.

ఆహార ధాన్యాలు, వస్త్రాలు మొదలైన వాటిని దానం చేయటం వలన



ఆపదలు తొలగినట్లు, పుత్ర సంతానం కల్గినట్లు, దానాలు చేయటం వలన దేవతలు ప్రసన్నులయినట్లు మానవులు తమ కోరికల్ని సాధించుకోగలిగినట్లు పురాణాలు చెప్తున్నాయి.

**అన్ని దానాల్లో మిన్న :**

ఎన్నో వ్రతాలు, పూజలు చేయగా వచ్చిన ఫలితం కంటే ఆకలిగొన్నవారికి పట్టెడన్నం పెట్టడమే ఎక్కువ ఫలితాన్నిస్తుందట.

**అన్నార్తుల సేవ :**

సనాతనుల దృష్టిలో అన్నార్తులు నారాయణ స్వరూపులు. ఈ లోకంలో ఎంతోమంది క్షుద్బాధతో అలమటిస్తున్నారు. కనుక మనం అతి తిండిని తగ్గించి కొంతభాగాన్ని నారాయణస్వరూపులకు అందించడమే నిజమైన నారాయణ సేవ. నారాయణ స్వరూపానికి తృప్తి కలిగించి అతణ్ని సేవించి మనం తృప్తి పొందడమే సాధన.

**సత్పురుషుల సందేశం :**

గొప్పవారి సంపదలు పరోపకారానికై ఉపయోగపడతాయే తప్ప ఎన్నడూ స్వార్థానికి రావు.

**ధనాభివృద్ధికి దానం :**

ఎటువంటి వారికైనా శీలమే ప్రధానం. దివ్యైశ్వర్యములున్నచోట సౌజన్యం, పరాక్రమానికి డాంబికం లేని మౌనం, నేర్చుకున్న విద్యకు నీతి, మంచి బుద్ధికి శాంతం, బలానికి ఓర్పు, ధనాభివృద్ధికి దానాలు అవసరం. శక్త్యానుసారం దానధర్మాలు చేయడం అంతులేని ఐశ్వర్యాన్ని సమకూర్చి పెట్టే సాధనాలు.

**ధన దానం :**

యోగ్యులకు దానం చేయడంవల్ల సత్కార్యాలు జరిగి ధనానికి హితమూ,

అయోగ్యులకు దానం చేయడంవల్ల దుష్కార్యాలు జరిగి ధనానికి అహితమూ కలుగుతాయి. అందువల్ల ధర్మకార్యాలకు యోగ్యులకు ధనం సమర్పించడం వల్ల పుణ్య లభిస్తుంది. అలా సంపాదించిన పుణ్యంవల్ల భగవంతుడు ప్రసన్నుడై కోరిన కోర్కెలు తీరుస్తాడు.

ఎవరైనా వచ్చి యాచించినప్పుడు అంతో ఇంతో ఇచ్చి తీరాలి. దానం చేసే అలవాటున్నవారికి ఏనాటికైనా సంసారబాధలనుండి తరింపజేసే పుణ్యాత్ముడు ప్రతిగ్రహీతగా లభ్యమౌతాడు.

దాతయొక్క సంకల్పాన్ని బట్టి దానఫలాన్ని పొందుతాడు. చేసిన దానం గురించి గొప్పగా చెప్పుకోవడంవల్ల దాన ఫలం తగ్గుతుంది.

దానం చేసేటప్పుడు ప్రతిగ్రహీతను పూజించాలి. అలా చేసిన దానాన్ని మాత్రమే ప్రతి గ్రహీత స్వీకరించాలి.

**పుడమితల్లి అనుగ్రహం :**

అన్నం భగవంతుని సొత్తు. మనది కాదు. పరమాత్మయే వర్షాలను కురిపించి ధాన్యాన్ని సృష్టించాడు. ఎన్నో జీవరాసులకు పుడమితల్లి తన కడుపు చీల్చి అన్నం పెట్టి ఆశీర్వదించి అనుగ్రహిస్తోంది.

**అన్నదానానికున్న ప్రాముఖ్యత :**

అన్ని దానాల్లో అన్నదానం ఎందుకు ఉత్కృష్టమైనదంటే ధనం ఎంత ఇచ్చినా మనిషికి ఆశ చల్లారదు. తృప్తి కలుగదు. అదే ఆకలి గొన్నవారికి అన్నం పెడితే కడుపునిండగానే ఆశ చల్లారుతుంది. తృప్తి కలుగుతుంది.

దేవతల ఉత్సవాలలో, యజ్ఞయాగాదులలో, పండుగలలో అన్నదానం చేసే అలవాటు పూర్వీకుల నుండి వస్తున్నది.

**'నీవు ఇచ్చే ధర్మ వస్తువు' నీది కాదు. ఇతరులకు ఇవ్వడం కోసమే అది నీ వద్దకు వచ్చిందని (భగవంతుడు అందజేసాడని) భావించాలి.**



అన్నదాత సుఖీభవ !

# ఆణిముత్యాలు

## శ్రీసాయినాథుని దివ్య రసామృత మహావాక్యములు

*– సంకలన కర్త : **మాదా నాగలింగం,** గొబ్బకవీధి, జాంపేట, రాజమండ్రి*

□ □ నీ తలంపులు కోరికలకు నన్నేకైక లక్ష్యము చేసుకొంటివా! నీవు పరమార్థము బడయగలవు. చలింపని శ్రద్ధతో నన్ను చూడుము. నేనును నిన్నుచూతును. నా గురుదేవుడు నాకు బోధించిన ఏకైక సత్యము ఇది యొక్కటె. చతుర్విధ సాధనములతో, ఆరు శాస్త్రములతో నీకు అవసరము లేదు. గాఢమైన విశ్వాసము శ్రద్ధతో నీ గురువును విశ్వసింపుము. అది చాలును.

□ □ మనస్సు నిలకడగా నుంచుము. నా మాటలయందు విశ్వాస ముంచుము. నా లీలలు వ్రాసినచో అవిద్య నిష్క్రమించిపోవును. వానిని శ్రద్ధాసక్తులతో నెవరు వినెదరో వారికి ప్రపంచమందు మమత క్షీణించును. బలమైన భక్తి,ప్రేమ కెరటములు కలుగును. ఎవరయితే నా లీలలో మునిగెదరో వారికి జ్ఞానాలంకారము లభించును.

□ □ నా నామమును ప్రేమతో నుచ్చరించిన వారి కోరికలన్నియు నెరవేర్చెదను. వారి భక్తిని హెచ్చించెదను. వారి నన్నిదిశలందు కాపాడెదను.

□ □ ఏ భక్తుడయితే మనఃపూర్వకముగా నాపై నాధారపడియున్నారో వారీ కథలు వినునప్పుడు మిక్కిలి సంతసించెదరు. నా లీలలను పాడువారి కంతులేని యానందమును, శాశ్వతమైన తృప్తియు నిచ్చెదనని నమ్ముము.



## సూక్తులు

- సత్యాన్ని మించిన ధర్మం లేదు. పరోపకారానికి మించిన దైవప్రార్థన లేదు. ఆచరణకు వివేకము విచక్షణ అవసరము.
- ఆహారశుద్ధివలన భావశుద్ధి ఏర్పడుతుంది.
- కార్యసఫలత, విఫలత కూడ మాటల మీదే ఆధారపడి ఉంటుంది.
- భగవంతుడు మనకి పెట్టే పరీక్షలు మన గుణ శీలాదులను సంస్కరించే నిమిత్తమేనని గ్రహించి, భగవదనుగ్రహాన్ని అందుకొనే ప్రయత్నం చేయాలి.
- సమరస భావంతో, ప్రేమ తత్త్వంతో లౌకిక వ్యవహారములందు వ్యవహరించాలి గానీ ఈర్ష్యాద్వేషములతో ప్రవర్తించకూడదు.
- ప్రలోభానికి లోనై ఏకాగ్రతను కోల్పోతే లక్ష్యాన్ని సాధించలేరు.
- ఇతరుల దృష్టిని ఆకర్షించాలని చేసే పనులు అనర్థహేతువులు.
- భగవంతుని ఆజ్ఞలను ఆనందంతో స్వీకరించినవారికి భగవదనుగ్రహం తప్పక లభిస్తుంది.
- భగవంతుని పట్ల సంపూర్ణ శరణాగత తత్త్వమును కలిగివున్నాడంటే అటువంటి అనన్యభక్తి వుండే వారి యోగక్షేమం భగవంతుడే చూసుకుంటాడు.
- జీవులను బాధించే దేవుళ్ళను పూజించుట వలన ఫలితముండదు.
- ఇతరులకు కలిగిన కష్టములు తనకు కలిగినటువంటివిగా తలచి వారికి సహాయము చేయాలి.
- భక్తుడు ఏ భావంతో భగవంతుని చింతిస్తాడో ఆ రూపంలో ఆ భావనతో భగవంతుడు సాక్షాత్కరిస్తాడు.
- మానవుడు అమృతపుత్రుడు. అతనికి నాశనమనేది లేదు. నాశనము దేహమునకే గానీ దేహికి కాదు.
- ఎవరైతే మనోవాక్కాయములను దైవమునకు అర్పిస్తారో వారికి మోక్షము ప్రాప్తిస్తుంది.



- ఆత్మనిగ్రహం, ఆత్మజ్ఞానం లేకపోతే మానవ జీవితమునకు సార్థకము చేకూరదు.
- సాధువచనాలు వేదవచనాలవలె ప్రమాణములుగా గుర్తించాలి.
- గురుపూజ అంటే గురువుగారిని గౌరవించటం, సేవించటం, ప్రబోధలను అర్థం చేసుకొని నడచుకోవటం పవిత్రమైన మార్గం.
- మనము నామసంకీర్తనం చేసేటప్పుడు, భగవంతుని చింతన తప్ప ఏ ఇతర చింతనలు చేయకూడదు.
- ప్రార్థన అనగా మాటలు పరిశ్రమ కాదు. హృదయంలోని దివ్యత్వమును మేలుకొల్పేందుకు పడే తపన.
- భగవంతుని చిత్రపటములను గానీ విగ్రహములను గానీ ఆరాధించేటప్పుడు, వాటిని దివ్యత్వమునకు ప్రతీకలుగా సజీవమూర్తులుగా విశ్వసించాలి.
- **జీవునిలో అతనికే తెలియకుండా ఉన్న ఆత్మతత్వాన్ని ఎరుకపరిచి, జ్ఞానధనాన్ని అందించేవాడు గురువు.**
- **భగవంతుడు భక్తుని ఆర్తితో కూడిన ప్రార్థనను ఆలకించి రక్షించేంత సమీపంలో ఎప్పుడూ ఉంటాడు.**
- అంతర్దృష్టి అభివృద్ధిచేసుకొని అంతర్భావములు ప్రశాంతముగా వుండేటట్లు ప్రయత్నించాలి.
- ఎవరికైనా పరమాత్మజ్ఞానం సిద్ధించిన తరువాతే మోక్షం వస్తుంది.
- మన భక్తి పరమాత్మ హృదయాన్ని ద్రవింపజేసేదై ఉండాలి.
- పరమాత్మ జ్ఞానము నీకు కలిగితే నీ హృదయములో ప్రేమ నిండుకుంటుంది.




# లేఖలు

నేను సాయిదర్శన్ సభ్యు డవటం నా అదృష్టంగా భావిస్తున్నాను. పది రూపాయలకే కాదు గదా పదివేలు రూపాయలు ఇచ్చినా పొందలేని ఎన్నో అమూల్యమైన సత్యాలు, లీలలు ప్రతినెల తెలుసుకొంటున్నాము. ఒక్కమాటలో చెప్పాలంటే శ్రీసాయిదర్శన్‌లోని ప్రతి అక్షరము వెలకట్లలేని అమూల్యరత్నాలని చెప్పటం అతిశయోక్తి కాదేమో. శ్రీసాయిదర్శన్ మాసపత్రిక సాయి భక్తులందరకూ శ్రీసాయినాథుడు మీ ద్వారా అందిస్తున్న దివ్యకానుకగా భావిస్తున్నాను. మీరు శ్రీసాయిదర్శన్‌ద్వారా భారత ఆధ్యాత్మిక సంస్కృతిని ప్రచారం చేస్తున్నందుకు తమకు ధన్యవాదాలు అర్పిస్తున్నాను.

బి.కృష్ణమూర్తి,<br>
మదనపల్లి,<br>
చిత్తూరుజిల్లా

ఏప్రియల్ నెలలో మీరు చిత్తూరుజిల్లా మదనపల్లి శ్రీసాయి మందిరంలో కొట్టిన కొబ్బరికాయలో బాబావారు నిలుచునట్లు, ద్వారకామాయిలో కూర్చునట్లు, వినాయకుడు పూర్తిగా అందరికీ కనిపించేటట్లు దర్శనమిచ్చారు. సాక్షాత్ మీ రూపంలో బాబావారు మీ ద్వారా ప్రకటితమవ్వడం మీరు చేసే నిస్వార్థసేవకు నిదర్శనం. మీరు బాబా లీలలు శ్రీసాయిదర్శన్ ద్వారా ఎందరో సాయి భక్తులకు దేశవిదేశాలలో కూడా సాయిబాబా గూర్చి ప్రచురించి పూస్తకరూపంలో ఎందరినో జ్ఞానాన్ని పంచుతున్నారు. నాకు మాత్రం మీరే సాయిలా కనిపించారు. ఇది నిజం. సాక్షాత్ శ్రీసాయి మీరు ఒక్కరే. నమస్తేజీ.

సాయిబంధు<br>
ఆర్జిసత్యనారాయణ,<br>
68-1-16,<br>
శ్రీలక్ష్మీదుర్గాసాయినిలయం,<br>
అశోక్‌నగర్,<br>
కాకినాడ - 533 003



Printed Published and owned by A.V.Ramana Rao at 1-5-62/2/B Maruthi Nagar, Hyderabad - 500 060. Printed at Sri Kala Printers, 1-1-781/B/4, Gandhi Nagar, Hyderabad - 80 Ph : 27611864, on behalf of Roopa Art Centre, Keshav Memorial Lane, Narayanaguda, Hyderabad - 029. Editor - **A.V.Ramana Rao**